www.methukuseema news

Methuku Seema

# మెతుకు సీమ

నిత్యం - ప్రజల పక్షం

తెలుగు డిజిటల్ దిన పత్రిక

హైదరాబాద్ | సంపుటి :01 | సంచిక :01 | శనివారం | 05 అక్టోబర్ 2024

Published from : Hyderabad,Sanagareddy,Warangal,Nalgonda,Nizamabad,Kammam

పేజీలు :05 వేల :05

మెతుకు సీమ

నిత్యం - ప్రజల పక్షం | తెలుగు దిన పత్రిక

మీ ప్రాంతంలో జరుగుతున్న అవినీతిని బయట పెట్టాలని ఉందా..
నిజాన్ని నిర్భయంగా చెప్పాలని ఉందా..
సంచలనా కథనాలకు కేరాఫ్ గా నిలిచిన ' మెతుకు సీమ '

విలేకరులు కావలెను

తెలంగాణ రాష్ట్రంలో సంచలంగా దూసుకెళ్తున్న ' మెతుకు సీమ '
తెలుగు దినపత్రికలో పనిచేయుటకు మండలాల వారిగా,
నియోజకవర్గం జిల్లాల వారిగా విలేకరులు కావలెను.

9032793832 , 8848667610

# కార్యకర్తలందరికీ న్యాయం చేస్తాం



- పని చేస్తే గుర్తింపు.. దానికి నేనే ఉదాహరణ
- మరో పదేళ్లు అధికారంలో ఉండేది కాంగ్రెస్సే
- రాజకీయాల్లోకి నన్ను తీసుకొచ్చింది డీఎస్సే
- ఎప్పటికీ ఆయనను గురువుగానే భావిస్తాను
- రేవంత్ ఆధ్వర్యంలో హామీలన్నీ నెరవేరుస్తాం

హైదరాబాద్,అక్టోబర్ 05 ( మెతుకు సీమ న్యూస్) : 'కాంగ్రెస్ కార్యకర్తలు అధైర్యపడొద్దు.. రాబోయే రోజులు మీవే.. అందరికీ పదవులు వస్తాయి.. కొంత ఓపిక పట్టండి.. సీఎం రేవంత్‌రెడ్డి నేను, మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు కలిసి అధికారం రావడానికి కష్టపడ్డాం. కార్యకర్తల కోసం పని చేస్తాం. అందరికీ న్యాయం జరిగే విధంగా చూస్తాం'.. అని టీపీసీసీ అధ్యక్షుడు మహేషకుమార్‌గౌడ్ అన్నారు. నిజామాబాద్‌లోని పాత కలెక్టరేట్ మైదానంలో శుక్రవారం టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్ గౌడ్‌ను ఘనంగా సన్మానించారు. కాంగ్రెస్ రాష్ట్ర వ్యవహారాల ఇన్‌చార్జి దీపాదాస్ మున్షీ, పార్టీ ముఖ్య నేతలు, మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు ఈ కార్యక్రమానికి హాజరయ్యారు.ఈ సందర్భంగా నిర్వహించిన బహిరంగ సభలో మహేశ్‌కుమార్‌గౌడ్ మాట్లాడుతూ కాంగ్రెస్ అధికారంలోకి రావడానికి ఎన్నో ఏళ్లు కార్యకర్తలు కష్టపడ్డారని గుర్తు చేశారు. వచ్చే స్థానిక సంస్థల ఎన్నికల్లో వారందరినీ గెలిపించే బాధ్యత పార్టీతోపాటు సీఎం, మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, కార్పొరేషన్ల చైర్మన్లు తీసుకుంటారని తెలిపారు. పనిచేసే కార్యకర్తలకు, నేతలకు ఏదో విధంగా పదవులు దక్కేలా కృషి చేస్తామన్నారు. ప్రభుత్వం చేస్తున్న మంచి పనులను గడపగడపకూ తీసుకెళ్లాలని, స్థానిక ఎన్నికల కోసం ఇప్పటి నుంచే కష్టపడాలని సూచించారు. వచ్చే పదేళ్లు కాంగ్రెస్సే అధికారంలో ఉండేలా అందరం కలిసికట్టుగా పని చేద్దామని పిలుపునిచ్చారు. రాహుల్‌గాంధీని దేశ ప్రధానిని చేసేందుకు కార్యకర్తలు కృషి చేయాలన్నారు. పనిచేసే కార్యకర్తలకు కాంగ్రెస్ పార్టీ తగిన గుర్తింపు ఇస్తుందనడానికి తానే ఉదాహరణ అని చెప్పారు.ఒకప్పుడు కరాటే మాస్టర్‌గా పని చేసుకుంటున్న తనను.. డి.శ్రీనివాస్ తనను రాజకీయాల్లోకి తీసుకువచ్చారని గుర్తు చేశారు. తన రాజకీయ జీవితంలో పలు దఫాలు డీఎసను వ్యతిరేకించినా.. ఎప్పటికీ ఆయన్ను గురువుగానే భావిస్తానని తెలిపారు. తాను పీసీసీ అధ్యక్షుడిని అవుతానని కలలో కూడా ఊహించలేదన్నారు. ఈ అవకాశం కల్పించిన అగ్ర నేతలు సోనియాగాంధీ, రాహుల్‌గాంధీ, మల్లికార్జున ఖర్గేకు ఎప్పటికీ రుణపడి ఉంటానని తెలిపారు. టీపీసీసీ అధ్యక్ష పదవికి తనతోపాటు మధుయాష్కీ, లక్ష్మణ్‌కుమార్ పోటీ పడ్డారని, తనకు పదవి దక్కాక వారు కూడా తనకు శుభాకాంక్షలు తెలిపారని చెప్పారు. మూడేళ్ల క్రితం రేవంత్‌రెడ్డిని పీసీసీ అధ్యక్షుడిగా, తనను వర్కింగ్ ప్రెసిడెంట్‌గా నియమించినప్పుడు సమన్వయంతో పని చేశానని, ఇప్పుడూ అదే తీరులో ముందుకు సాగుతానని పేర్కొన్నారు.సీఎం రేవంత్‌రెడ్డి టీమ్‌లో మంచి మంత్రులు ఉన్నారని, కష్టమైనా.. పథకాలు అమలు చేస్తున్నారన్నారు. గత బీఆర్‌ఎస్ ప్రభుత్వం చేసిన అప్పులను తిరిగి చెల్లిస్తూనే.. అభివృద్ధిని పరుగులు పెట్టిస్తున్నారని చెప్పారు. పార్టీ పదవుల్లో ఎస్సీ, ఎస్టీ, మైనార్టీలకు 61శాతం దక్కేలా కృషిచేస్తానని హామీ ఇచ్చారు. దేవుళ్లు, మతాల పేరిట కాంగ్రెస్ పార్టీ ఎప్పుడూ రాజకీయాలు చేయలేదని మహేశ్‌గౌడ్ గుర్తు చేశారు. మతాలు, కులాల పేరిట ప్రజలను రెచ్చగొట్టడం ద్వారా కేంద్రంలో బీజేపీ మూడో సారి అధికారంలోకి వచ్చిందని దుయ్యబట్టారు. పదేళ్లలో సామాన్య ప్రజల కోసం మోదీ ఏం చేశారని నిలదీశారు. పదేళ్లపాటు పాలించిన కేసీఆర్.. రాష్ట్రాన్ని అప్పుల కుప్పగా మార్చారని దుయ్యబట్టారు. సామాన్య కార్యకర్త నుంచి పీసీసీ అధ్యక్షుడి వరకూ ఎదిగిన మహేశ్‌గౌడ్ జీవితాన్ని కార్యకర్తలు ఆదర్శంగా తీసుకోవాలని మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావు సూచించారు. పార్టీ కోసం అహర్నిశలు కృషి చేసిన వ్యక్తి మహేశ్‌గౌడ్ అని కొనియాడారు. ఇచ్చిన మాట ప్రకారం రైతులకు రుణమాఫీ చేశామని, త్వరలోనే పంటల బీమా పథకాన్ని తీసుకొస్తామన్నారు.ఎన్నికల సమయంలో ఇచ్చిన ప్రతి హామీని ప్రభుత్వం నెరవేరుస్తుందని మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి పేర్కొన్నారు. దసరాలోపే ప్రతీ కుటుంబానికి డిజిటల్ ఫ్యామిలీ కార్డు అందిస్తామన్నారు. రేషన్‌తోపాటు అన్ని సంక్షేమ పథకాలకు ఈ కార్డు ఉపయోగపడుతుందన్నారు. క్రమశిక్షణతో పనిచేస్తే తగిన గుర్తింపుతో పాటు అవకాశాలు వస్తాయని, దానికి మహేశ్‌గౌడే ఉదాహరణ అని మంత్రి పొన్నం ప్రభాకర్ అన్నారు.స్థానిక సంస్థల్లో కాంగ్రెస్ జెండా ఎగిరే విధంగా కార్యకర్తలు కృషి చేయాలన్నారు. ఆరు గ్యారంటీలను తప్పనిసరిగా అమలు చేస్తామని మంత్రి శ్రీధర్‌బాబు స్పష్టం చేశారు. ప్రతిపక్ష పార్టీల నేతలు అనవసర ఆరోపణలు చేస్తున్నారని, ప్రజల దృష్టిని మళ్లించేందుకు ప్రయత్నిస్తున్నారని దుయ్యబట్టారు. కాంగ్రెసలో కష్టపడ్డ వారికి అవకాశాలు వస్తాయని మంత్రి కొండా సురేఖ అన్నారు. మహేశ్‌గౌడ్, పొన్నం ప్రభాకర్, తాను కలిసి ఎన్‌ఎసయూఐలో పని చేశామని మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి గుర్తు చేశారు. ఏళ్ల తరబడి ఎన్నో ఆటుపోట్లను ఎదుర్కొంటూ ప్రజల పక్షాన పోరాడామన్నారు.వచ్చే స్థానిక సంస్థల ఎన్నికల్లో కాంగ్రెసను గెలిపించాలని పార్టీ రాష్ట్ర వ్యవహారాల ఇన్‌చార్జి దీపాదాస్ మున్షీ పిలుపునిచ్చారు. పని చేసే కార్యకర్తలకు అవకాశాలు ఇస్తామని భరోసాఇచ్చారు. కాగా, నిజామాబాద్‌కు వచ్చిన మంత్రి తుమ్మల.. మార్గమధ్యలో డిచ్‌పల్లి మండలం ధర్మారం(బి)గ్రామంలోని మాజీ మంత్రి మండవ వెంకటేశ్వరరావు ఇంటికి వెళ్లారు. మండవ కుటుంబసభ్యులతో కలిసి భోజనం చేశారు. కాగా, మహేశ్‌గౌడ్ నిజామాబాద్ వెళ్లడంతో గాంధీభవన్‌లో నిర్వహించే మంత్రులతో ముఖాముఖి కార్యక్రమం వాయిదా పడింది. ప్రజలు, కార్యకర్తలు సోమవారం గాంధీభవన్‌కు వచ్చి విజ్ఞప్తులు అందించాలని టీపీసీసీ సూచించింది.

## రుణమాఫీపై సీఎం మాటలన్నీ అబద్ధాలే - కేటీఆర్




- వంద శాతం రుణమాఫీ పూర్తి చేశామన్న సీఎం మాటలన్నీ డొల్లమాటలేనన్న కేటీఆర్
- 20 లక్షల మందికి రుణమాఫీ కాలేదని మంత్రి తుమ్మల ప్రకటన
- దీనిపై ఎక్స్ వేదికగా స్పందించిన కేటీఆర్

హైదరాబాద్,అక్టోబర్ 05 ( మెతుకు సీమ న్యూస్) : రైతు రుణమాఫీపై సీఎం రేవంత్ రెడ్డి మాటలన్నీ పచ్చి అబద్ధాలేనంటూ బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ అన్నారు. తాజాగా వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు మాట్లాడుతూ 20 లక్షల మందికి రుణమాఫీ

## సమంతపై కొండా సురేఖ వ్యాఖ్యలు... తీవ్రంగా స్పందించిన కేంద్రమంత్రి




- మంత్రి వ్యాఖ్యలు కాంగ్రెస్ మహిళా వ్యతిరేక మనస్తత్వానికి నిదర్శనమని వ్యాఖ్య
- పరిశ్రమను కాంగ్రెస్ ఏ విధంగా చూపించే ప్రయత్నాలు చేస్తోందో అర్థమవుతోందన్న కేంద్రమంత్రి
- రాహుల్ గాంధీ ఎందుకు మౌనం వహిస్తున్నారని ప్రశ్న

## రుణమాఫీపై సీఎం మాటలన్నీ అబద్ధాలే - కేటీఆర్

మొదటిపేజీ తరువాయి కాలేదని చెప్పడంతో ముఖ్యమంత్రి బండారం మరోసారి బయటపడిందని తెలిపారు. ఎక్స్ వేదికగా కేటీఆర్ ఈ మేరకు పోస్ట్ చేశారు. వంద శాతం రుణమాఫీ పూర్తి చేశామన్న సీఎం మాటలన్నీ డొల్లమాటలేనని ఇంకోసారి తేలిపోయింది. ఓ వైపు డిసెంబర్ 9న ఏక కాలంలో రుణమాఫీ చేస్తామని మోసం చేసి.. మరోవైపు 10 నెలలైనా 20 లక్షల మందికి అందించకుండా దగా చేస్తున్నారని దుయ్యబట్టారు. రెండు లక్షల రుణమాఫీ పూర్తయిపోయిందన్న సీఎం మాటలు పచ్చి అబద్ధాలు అని విమర్శించారు. చేస్తామన్న రుణమాఫీ ఇప్పటికీ పూర్తి చేయలేదని, ఇవ్వాల్సిన రైతుబంధు సీజన్ ముగిసినా ఇవ్వలేదంటూ బీఆర్ఎస్ నేత మండిపడ్డారు. అధికారిక లెక్కల ప్రకారం 20 లక్షల మంది రైతులకు అన్యాయం జరిగితే.. అనాధికారికంగా ఇంకా ఎంతమంది అన్నదాతలు ఉన్నారోనని కేటీఆర్ ఆవేదన వ్యక్తం చేశారు.

## సమంతపై కొండా సురేఖ వ్యాఖ్యలు... తీవ్రంగా స్పందించిన కేంద్రమంత్రి

న్యూ ఢిల్లీ,అక్టోబర్ 05 ( మెతుకు సీమ న్యూస్) : నాగచైతన్య, సమంత విడాకులు, నాగార్జునపై తెలంగాణ మంత్రి కొండా సురేఖ చేసిన వ్యాఖ్యలపై కేంద్రమంత్రి అశ్వినీ వైష్ణవ్ తీవ్రంగా స్పందించారు. ఈ మేరకు ఆయన ఎక్స్ వేదికగా ట్వీట్ చేశారు. పలువురు సినీ ప్రముఖులపై తెలంగాణ కాంగ్రెస్ ప్రభుత్వంలోని ఓ మహిళా మంత్రి చేసిన వ్యాఖ్యలు దిగ్భ్రాంతిని కలిగించాయని పేర్కొన్నారు. ఈ వ్యాఖ్యలు కాంగ్రెస్ పార్టీ మహిళా వ్యతిరేక మనస్తత్వానికి నిదర్శనమని రాసుకొచ్చారు.మన దేశానికి ఎంతో గర్వకారణమైన వినోద పరిశ్రమను కాంగ్రెస్ పార్టీ ఏ విధంగా చూపించే ప్రయత్నాలు చేస్తుందో కూడా ఈ మాటలను బట్టి అర్థమవుతోందని పేర్కొన్నారు. సమాజంలో ఇలాంటి విమర్శలకు తావు లేదన్నారు. తెలంగాణ మంత్రి (కొండా సురేఖ) వ్యాఖ్యలపై రాహుల్ గాంధీతో పాటు, కాంగ్రెస్ పార్టీ నాయకత్వం మౌనం వహిస్తోందని ఆరోపించారు. వారి మౌనం వెనుక ఆమె వ్యాఖ్యలకు మద్దతు ఇస్తున్నట్లుగా కనిపిస్తోందని ఆరోపించారు.

# 'ఎస్సీ వర్గీకరణ'పై సుప్రీంకోర్టు స్పష్టీకరణ

హైదరాబాద్,అక్టోబర్ 05 ( మెతుకు సీమ న్యూస్) : ఎస్సీ వర్గీకరణకు ఆమోదం తెలుపుతూ ఇచ్చిన తీర్పును సమీక్షించాలంటూ దాఖలు చేసిన పిటిషన్లను సుప్రీంకోర్టు కొట్టివేసింది. షెడ్యూల్డ్ కులాల ఉప వర్గీకరణ చేసుకోవచ్చని, ఆ అధికారం రాష్ట్రాలకు ఉందంటూ అత్యున్నత న్యాయస్థానం ఆగస్టు 1న తీర్పు ఇచ్చిన సంగతి తెలిసిందే. ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ డీవై చంద్రచూడ్ నేతృత్వంలోని ఏడుగురు సభ్యుల ధర్మాసనం 6:1 మెజారిటీతో ఇచ్చిన తీర్పును సమీక్షించాలంటూ పలు పిటిషన్లు దాఖలయ్యాయి. వాటిని విచారించిన సీజేఐ జస్టిస్ డీవై చంద్రచూడ్, న్యాయమూర్తులు బీఆర్ గవాయ్, విక్రమ్ నాథ్, బేలా త్రివేది, పంకజ్ మిత్తల్, మనోజ్ మిశ్రా, సతీశ్‌చంద్ర శర్మతో కూడిన ధర్మాసనం.. తీర్పును సమీక్షించాల్సిన అవసరం లేదని స్పష్టం చేసింది. "పిటిషన్లు అన్నింటినీ పరిశీలించాం. ఎస్సీ వర్గీకరణపై ఇచ్చిన తీర్పును పరిశీలించాల్సిన అవసరం కనిపించలేదు.పిటిషన్లను కొట్టివేస్తున్నాం" అని ఏడుగురు సభ్యుల రాజ్యాంగ ధర్మాసనం తెలిపింది. గతంలో రాజ్యాంగ ధర్మాసనంలో భిన్నమైన తీర్పు ఇచ్చిన ఏకైక జడ్జి జస్టిస్ బేలా త్రివేది కూడా పిటిషన్ల కొట్టివేతకు మద్దతు తెలపడం విశేషం. రివ్యూ పిటిషన్లను కొట్టివేస్తూ గత నెల 24న ధర్మాసనం తీర్పు ఇవ్వగా.. శుక్రవారం దాన్ని అప్‌లోడ్ చేశారు. ఎస్సీ వర్గీకరణకు అవకాశం లేదంటూ 2004లో ఈవీ చిన్నయ్య వర్సెస్ ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం కేసులో ఐదుగురు సభ్యుల రాజ్యాంగ ధర్మాసనం ఇచ్చిన తీర్పును ఈ ఏడాది ఆగస్టు 1న సీజేఐ నేతృత్వంలోని ఏడుగురు సభ్యుల ధర్మాసనం తోసిపుచ్చింది. ఎస్సీల రిజర్వేషన్లను వర్గీకరించి, అదే వర్గంలో అత్యంత వెనకబడిన వర్గాలకు ప్రత్యేక కోటాలు కల్పించడానికి పచ్చజెండా ఊపింది. అయితే న్యాయసమీక్షకు లోబడే ఈ వర్గీకరణ ఉంటుందని స్పష్టం చేసింది. నిర్దిష్ట గణాంకాల ఆధారంగా, అత్యంత వెనకబడిన వర్గాలకు న్యాయం చేసేందుకే దాన్ని ఉపయోగించాలని పేర్కొంది. రాష్ట్రాలు రాజకీయ ప్రయోజనాల కోసం నిర్ణయాలు తీసుకుంటే వాటిని న్యాయస్థానాలు సమీక్షించవచ్చని తెలిపింది.



# రాజ్యాంగ పునాదుల్ని కదిలిస్తున్న 'జమిలి'

హైదరాబాద్,అక్టోబర్ 05 ( మెతుకు సీమ న్యూస్) : జమిలి ఎన్నికలపైన కోవింద్ కమిటీ నివేదికకు మోడీ క్యాబినెట్ ఆమోదం తెలిపింది.దేశానికి ఇప్పుడు జమిలి ఎన్నికలే తక్షణ అవసరమా? పదేపదే ఎన్నికలు ఖజానా మీద భారం మోపుతున్నాయని వీటిని సమర్థించేవారు అంటున్నారు.పదేపదే ఎన్నికల వల్ల అభివృద్ధి మీద,పాలన మీద ప్రభుత్వ కేంద్రీకరణకు ఆటంకాలు ఏర్పడుతున్నాయని వీరి వాదన.నెహ్రూ,అంబేద్కర్ లాంటి గొప్ప నాయకులున్నప్పుడే జమిలి ఎన్నికలు జరిగాయి కదా! ఇప్పుడెందుకొద్దు అంటున్నారు.అనేక రాజకీయ పార్టీలు,అసోచామ్,సీఐఐ లాంటి పారిశ్రామికవేత్తల సంఘాలు, కొందరు మాజీ న్యాయమూర్తులు కూడా సమర్థిస్తున్నారు కాబట్టి,జమిలి ఎన్నికలు సమర్థనీయమే అంటున్నారు.ప్రస్తుత ఎన్నికల విధానంలో పార్టీ ఫిరాయింపులు సర్వసాధారణమయ్యాయనీ,అస్థిర పాలనకు కారణమవుతున్నాయంటున్నారు.మోడీకి అనుకూల సమయంలో కోవింద్ కమిటీ రిపోర్టును తెప్పించుకున్నారనీ,క్యాబినెట్ ఆమోదం పొందారని జమిలి ఎన్నికలను వ్యతిరేకించే కొంతమంది వాదన.మోడీ పాలన స్థిరపరచుకునేందుకే ఈ ప్రయత్నమంతా అని వారి ఆరోపణ.ప్రతిపక్షం పాలించే రాష్ట్రాల్లో ప్రభుత్వాలను అస్థిరపరిచేందుకు,కేంద్రం పట్టు బిగించేందుకు అవకాశాలు మరింత పెరుగుతాయనేది వీరి అభిప్రాయం.నిజానికి నివేదిక ఎప్పుడొచ్చింది,ఎప్పుడు ఆమోదించారన్నది ముఖ్యం కాదు.ఇది ప్రతిపక్ష పార్టీలు పరిపాలిస్తున్న రాష్ట్రాల సమస్య మాత్రమే కాదు.మోడీ లేదా బీజేపీ పాలన స్థిరపరచుకోవాలన్న లక్ష్యం మాత్రమే కూడా కారణం కాదు.వీటన్నింటికన్నా లోతైన సమస్య.భారతదేశ రాజ్యాంగం మౌలిక పునాదులనే కదిలించే సమస్య. పదేపదే ఎన్నికలు జరగడం వల్ల ప్రభుత్వ ఖజానా మీద మోయలేని భారం పడుతుందన్న వాదన హాస్యాస్పదం.అధికారిక పరిమితిని మించి అనేకరెట్లు ఖర్చుపెడుతున్న వారే ఈ వాదన చేస్తున్నారు.ప్రజాస్వామ్యం పరిపుష్టం చేయాల్సిన బాధ్యతను డబ్బుతో ముడిపెట్టడం సరైందా? ప్రజాస్వామ్య మూలాలు మింగుడు పడనివారే వీటిని ఖర్చుతో ముడిపెడతారు.స్వాతంత్రోద్యమ వారసత్వాన్ని అందిపుచ్చుకునేవారు ప్రజాస్వామ్యం మరింత బలపడాలని కోరుకుంటారు.ఖర్చు తగ్గుతుందన్న గ్యారంటీ కూడా లేదు.ఒక రాష్ట్రప్రభుత్వం ఐదేండ్లు పూర్తికాకుండానే తొందరగా పడిపోతే మళ్లీ ఎన్నికలు నిర్వహించాలన్న ప్రతిపాదన ఉన్నది.కానీ ఈ ఎన్నిక జమిలి ఎన్నికలనాటి వరకే.ఐదేండ్ల కోసం కాదు.అంటే అదనంగా మరొకసారి ఎన్నికలు నిర్వహించడమే కదా! ఇప్పుడున్న పద్ధతి ప్రకారమైతే ఎన్నుకోబడిన నాటి నుండి ప్రభుత్వం ఐదేండ్లు కొనసాగుతుంది.మధ్యలో మరో ఎన్నిక అవసరం ఉండదు.అంతేకాదు,కేంద్రం నిరంకుశత్వం గ్యారంటీగా పెరుగుతుంది.ప్రజల ముందుకు పోవడానికి వీరు భయపడుతున్నారు.ప్రజానుకూల విధానాలు అమలు జరిపితే భయమెందుకు? పైగా పాలకులు ఒళ్లు దగ్గర పెట్టుకోవడానికి ఈ ఎన్నికలు ఉపయోగపడతాయి కదా! ఒకసారి ఎన్నికైతే ఐదేండ్లు అడిగేవారుండరన్న భరోసా ఏర్పడినప్పుడు ఈ పాలకులు ప్రజలను ఖాతరు చేయరు. పెట్టుబడిదారులకు,భూస్వాములకు అనుకూలంగా వ్యవహరించదలచినప్పుడే ప్రజల ముందుకు పోవడానికి భయాలు.పారిశ్రామికవేత్తల సంఘాలు పదేపదే ఎన్నికలు నివారించాలనడంలో సారాంశం ఇదే కదా! ప్రజాస్వామ్యంలో ప్రజలే అంతిమ నిర్ణేతలు.ప్రజాభిప్రాయానికి పరిమితులు విధించాలని కొన్ని పార్టీలు లేదా సంఘాలు,సంస్థలు,వ్యక్తులు చెబితే సరైందికాదు.అశేష ప్రజానీకానికి వీరు ప్రత్యామ్నాయం కాదు.రాచరికాల్లో,బ్రిటిష్ పాలనలో ప్రజాభిప్రాయానికి




స్థానం లేదు.ఇందిరాగాంధీ విధించిన ఎమర్జెన్సీ కాలంలో ప్రజాభిప్రాయానికి పరిమితులు విధించారు. ఇప్పుడు మోడీ పాలనలో ప్రజాభిప్రాయానికి మరిన్ని పరిమితులు విధించి రాజదండం స్ఫూర్తితో కొరడా ఝులిపించాలని ప్రయత్నిస్తున్నారు.పార్టీ ఫిరాయింపులకు కూడా ఇది ప్రత్యామ్నాయం కాదు.ఇప్పుడున్న ఫిరాయింపుల నిరోధక చట్టంలో పటిష్టమైన సవరణలు చేయవచ్చు.దామాషా ఎన్నికల పద్ధతికి సిద్ధపడితే ఫిరాయింపుల సమస్యే ఉత్పన్నం కాదు. వీటి ఊసెత్తడానికే పాలకులు సిద్ధంగా లేరు.నెహ్రూ,అంబేద్కర్ లాంటి నేతలు ఉన్నప్పుడే జమిలి ఎన్నికలు జరిగాయన్న వాదనకు పసలేదు.ఇక్కడ సమస్య జమిలి ఎన్నికలు కాదు.సహజ క్రమంలో యాధృచ్ఛికంగా అన్ని ఎన్నికలు ఒకేసారి వస్తే వచ్చే ప్రమాదమేమీ లేదు. 1951-62 మధ్య జరిగిన ఎన్నికలు అట్లా జరిగినవే.కేంద్ర పాలకులు రాజ్యాంగంలోని ఆర్టికల్ 356ను దుర్వినియోగం చేసి కొన్ని రాష్ట్ర ప్రభుత్వాలను కూల్చివేసారు.దాని ఫలితంగానే జమిలి ఎన్నికలకు అవకాశం లేకుండా పోయింది.ఆర్టికల్ 356ను రద్దు చేయడానికి మోడీ ప్రభుత్వం సిద్ధంగా లేదు. గత కాంగ్రెస్ బాటలోనే కేంద్ర బీజేపీ సర్కార్ కూడా 356వ అధికరణాన్ని దుర్వినియోగం చేయడం చూస్తూనే ఉన్నాం.యాధృచ్ఛికంగా ఒకేసారి ఎన్నికలు వస్తే శాంతిభద్రతల సమస్యలు,పోలీసు బలగాల అందుబాటు,తగినంత ప్రభుత్వ యంత్రాంగం లాంటి ఆచరణ సమస్యలే తప్ప,విధానపరమైన ఇబ్బందులు ఉండవు.ఒకేసారి ఎన్నికల కోసం రాజ్యాంగాన్ని సవరించడం,చట్టం చేయడమే ప్రమాదం. రాజ్యాంగాన్ని సవరిస్తే జమిలి ఎన్నికల కోసం కొన్ని శాసనసభల కాలం పూర్తికాకుండానే రద్దు చేయాలి.మరికొన్ని శాసనసభల కాలపరిమితిని పొడిగించాలి.ఈ రెండూ అప్రజాస్వామికమే.పొడిగించే బదులు గవర్నర్ లేదా రాష్ట్రపతి పాలన విధించడం మరింత అప్రజాస్వామికం.రాష్ట్రాల మీద కేంద్రం పెత్తనం చేయడమే. రాష్ట్రాల హక్కులను,అధికారాలను తృణీకరించడమే.ఐదేండ్లు పూర్తికాకుండానే ప్రభుత్వం కూలిపోతే మిగిలిన కాలానికి గవర్నర్ లేదా రాష్ట్రపతి పాలన కూడా అప్రజాస్వామికమే.ప్రజాస్వామ్యయుతంగా ఎన్నికైన ప్రభుత్వం అసెంబ్లీని రద్దుచేసి మరోసారి ప్రజాభిప్రాయం కోరే అవకాశం ఉండదు. ప్రభుత్వం మెజారిటీ కోల్పోయి,ప్రత్యామ్నాయానికి అవకాశం లేనప్పుడు మళ్లీ ప్రజాతీర్పును కోరే అవకాశం కూడా లేదు.పైగా అవిశ్వాస తీర్మానం ప్రతిపాదించేవారు ప్రత్యామ్నాయ ప్రతిపాదన కూడా జోడించాలంటున్నారు. అంటే,అప్పటికే ఉన్న ప్రభుత్వాన్ని తొలగించే హక్కును హరించడమే.ఉన్న ప్రభుత్వాన్ని తొలగించే హక్కును ప్రత్యామ్నాయ సూచనకు లోబడి అమలు చేయాలనడం అప్రజాస్వామికం. పార్లమెంట్ విషయంలో కూడా ఇవే ప్రశ్నలు తలెత్తుతాయి.ఎన్నికైన ప్రభుత్వం మెజారిటీ కోల్పోతే రాష్ట్రపతి పాలన విధించినా లేక మైనారిటీ ప్రభుత్వమే ఐదేండ్లు పూర్తయ్యేదాకా పరిపాలించాలన్నా ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేయడమే.గవర్నర్ లేదా రాష్ట్రపతి పాలన ద్వారా రాష్ట్రాల మీద కేంద్రం పట్టుబిగించడం ఫెడరల్ రాజ్యాంగ స్ఫూర్తికి విఘాతం. మన రాజ్యాంగం పీఠిక "భారతదేశ ప్రజలమైన మేము" అని ప్రారంభమవుతుంది. అంటే,ప్రజాభిప్రాయమే మన రాజ్యాంగం పునాది.ప్రజలే అంతిమ నిర్ణేతలు.జమిలి ఎన్నికల పేరుతో మన రాజ్యాంగంలోని ఈ పునాదులనే పెకిలించేందుకు ప్రయత్నిస్తున్నారు. భిన్నమైన భాషలు,భిన్న సంస్కృతులు,భిన్న జాతుల సమాహారమే ఈ దేశం.వీరి సంస్కృతి, సంప్రదాయాలను గౌరవిస్తూ వీరందరి ప్రయోజనాలను కాపాడగలిగినప్పుడే ఒకే దేశంగా మనగలుగుతాము.లేనట్టయితే దేశ సమగ్రతకు,సమైక్యతకే ముప్పు ఏర్పడవచ్చు.సువిశాలమైన భారతదేశంలో తీవ్రమైన ప్రాంతీయ అసమానతలు ఉన్నాయి. అందుకు తగిన ప్రణాళికలు అవసరమవుతాయి.వివిధ ప్రాంతాల ప్రయోజనాలు,ప్రాధాన్యతలు వేర్వేరుగా ఉంటాయి.ఈ వైవిధ్యాన్ని గుర్తించకుండా కేంద్రం పెత్తనం చేస్తే ప్రజలు అంగీకరించరు.బలవంతంగా అమలు చేయడం ప్రజాస్వామ్యానికి,సమాఖ్య వ్యవస్థకు వ్యతిరేకం.రాజ్యాంగ స్ఫూర్తికే విరుద్ధం.రవీంద్రుడు రచించిన జాతీయగీతం స్ఫూర్తిని నీరుగార్చడమే. ఒకే దేశం,ఒకే ప్రజ,ఒకే ఎన్నిక,ఒకే సంస్కృతి పేరుతో చేస్తున్న ఈ ప్రయత్నాలన్నీ అధికారాలను కేంద్రం గుప్పిట్లో పెట్టుకోవడానికి,నియంతృత్వాన్ని స్థిరపర్చడం కోసమే.జమిలి ఎన్నికల ప్రక్రియ ప్రారంభం నుంచి ఏక పక్షంగానే సాగుతున్నది.కోవింద్ కమిటీ సిఫార్సుల మేరకే ప్రక్రియ ప్రారంభించామనడం మోసపూరితం. జమిలి ఎన్నికలు నిర్వహించాలని ప్రధాని ముందుగానే నిర్ణయానికి వచ్చారు.కేవలం వాటి అమలుకు అవసరమైన పాలనాపరమైన, న్యాయపరమైన అంశాలను పరిశీలించే బాధ్యత మాత్రమే కోవింద్ కమిటీకి అప్పగించారు.మోడీ ఏకపక్షంగా పోజాలడని,ప్రాంతీయ పార్టీలు మోడీని కట్టడి చేస్తాయని ఆశించిన వారికి నిరాశే మిగిలింది. ఈ టీడీపీ,జనసేనలాంటి పార్టీలు కేంద్రంతో లాలూచీకే ప్రాధాన్యతనిచ్చాయి తప్ప,ప్రజా ప్రయోజనాలను పట్టించుకోలేదు.ప్రజాస్వామ్య విలువల కోసం నిలబడలేదు.మంత్రి వర్గం ఆమోదం కూడా పొందిన నేపథ్యంలో ఇక ప్రజలు చేయగలిగిందేమీ లేదా? కేంద్ర నియంతృత్వ పోకడలను భరించాల్సిందేనా? కానేకాదు. ఈ నిర్ణయాన్ని సగం రాష్ట్రాల శాసన సభలు ఆమోదించాలి.పార్లమెంట్ మూడింట రెండొంతుల మెజారిటీతో అంగీకరించాలి.ఈ ప్రక్రియ పూర్తి కావడానికి చాలా సమయం పడుతుంది.ఈ కాలాన్ని ప్రజలు,ప్రజాతంత్రవాదులు సద్వినియోగం చేసుకోవాలి.ప్రజలు సంఘటితం కావాలి.కేంద్ర పాలకులను నిలదీయాలి.ప్రతిపాదనను ఉపసంహరించుకునేంత వరకూ పోరాడాలి.

- ఎస్.వీరయ్య

# డిస్ట్రిక్ట్ యూత్ అండ్ స్పోర్ట్స్ అథారిటీ ఆధ్వర్యంలో సీఎం కప్ టార్చ్ ర్యాలీ కి ఘన స్వాగతం





సంగారెడ్డి బ్యూరో,అక్టోబర్ 05 ( మెతుకు సీమ న్యూస్) : స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ హైదరాబాద్ ఆధ్వర్యంలో ముఖ్యమంత్రి సీఎం రేవంత్ రెడ్డి చేతుల మీదగా ప్రారంభించబడిన సీఎం కప్ 2024 టార్చ్ ర్యాలీ హైదరాబాద్ నుండి వికారాబాద్ మీదుగా సంగారెడ్డికి చేరుకున్నది. సంగారెడ్డి పట్టణ కేంద్రంలో పెద్దాపూర్ లో డిస్ట్రిక్ట్ యూత్ అండ్ స్పోర్ట్స్ అథారిటీ ఆధ్వర్యంలో సీఎం కప్ టార్చ్ ర్యాలీ కి ఘన స్వాగతం పలికారు. టి జి ఐ ఐ సి చైర్మన్ నిర్మల జగ్గారెడ్డి, జిల్లా కలెక్టర్ వల్లూరు క్రాంతి, టి ఎన్ జి ఓ ఎస్ జిల్లా అధ్యక్షుడు జావిద్ అలీ ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథులుగా పాల్గొని ఘన స్వాగతం పలికారు.ఈ ర్యాలీ యొక్క ముఖ్య ఉద్దేశం త్వరలో జరగబోయే సీఎం కప్ గురించి ప్రజల్లో అవగాహన కల్పించి పట్టణ గ్రామీణ ప్రాంతాల నుండి ఎక్కువ క్రీడాకారులు పాల్గొనే విధంగా అవగాహన కల్పించడమే ముఖ్య లక్షమని డి వై ఎస్ ఓ కాసిం బేగ్ తెలిపారు.ఈ కార్యక్రమంలో ఏ ఓ పరమేష్,టి ఎన్ జి ఓ ఎస్ నాయకులు వెంకట్ రెడ్డి, విజయ్ కుమార్, ఆర్ఆర్ డిస్ట్రిక్ట్ డి వై ఎస్ ఓ వెంకటేశ్వర్లు, సీఎం కప్ సీఎం కప్ కాన్వాయ్ ఇంచార్జ్ సి ఐ మధు, యువజన సంఘాల అధ్యక్షుడు కూన వేణు తోపాటు క్రీడాకారులు విద్యార్థులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

---

# డిజిటల్ కార్డు సర్వేను పరిశీలించిన జిల్లా కలెక్టర్ వల్లూరు క్రాంతి



సదాశివపేట,అక్టోబర్ 05 ( మెతుకు సీమ న్యూస్) : రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఫ్యామిలీ డిజిటల్ కార్డు సర్వేను పకడ్బందీగా నిర్వహించాలని జిల్లా కలెక్టర్ వల్లూరి క్రాంతి అన్నారు. శుక్రవారం సదాశివపేట పట్టణంలో సర్వే పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ వల్లూరి క్రాంతి మాట్లాడుతూ సర్వే సిబ్బంది ప్రతి ఇంటికి వెళ్లి వివరాలు నమోదు చేయాలని సూచించారు. నిర్లక్ష్యం వహిస్తే చర్యలు ఉంటాయని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ ఉమా, తాసిల్దార్ సరస్వతి, మున్సిపల్ ఇంజనీర్ రాజేష్, అధికారులు సిబ్బంది పాల్గొన్నారు.

---

# శ్రీ వాసవి కన్యకా పరమేశ్వరి మందిరంలో నవరాత్రి ఉత్సవాలు





సదాశివపేట,అక్టోబర్ 05 ( మెతుకు సీమ న్యూస్) : స్థానిక పట్టణంలో దసరా నవరాత్రి ఉత్సవాల్లో రెండవ రోజు శ్రీ కన్యకా పరమేశ్వరి ఆలయ కమిటీ అధ్యక్షులు అనుముల సాయిరాజ్ ఆధ్వర్యంలో అమ్మవారిని గాయత్రి దేవి అలంకరణతో అమ్మవారికి అభిషేకం, సామూహిక మహిళా భక్త బృందం కుంకుమ అర్చనలు పూజలు నిర్వహించారు. ఇట్టి కార్యక్రమానికి స్థానిక ఎమ్మెల్యే చింత ప్రభాకర్ హాజరై ఆలయంలో అమ్మవారి కి ప్రత్యేక పూజలు నిర్వహించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నవరాత్రి విజయదశమి ఉత్సవాలను ప్రతి సంవత్సరం తొమ్మిది రోజులపాటు ఎంతో భక్తి శ్రద్ధలతో నిర్వహించడం సంతోషకరమన్నారు. ఆలయ అభివృద్ధికి తన వంతు సహకారాన్ని అందజేస్తానని ఆ అమ్మవారి కృపతోనే ప్రజలందరూ సుఖ, శాంతులతో ఉండాలని వేడుకుంటున్నామన్నారు. ఆర్యవైశ్యుల సంక్షేమానికి, ఆలయ అభివృద్ధికి తన వంతు కృషి చేస్తామన్నారు. కమిటీ ఆధ్వర్యంలో ఎమ్మెల్యే చింత ప్రభాకర్ ను పురపాలక సంఘం చైర్ పర్సన్ కౌన్సిల్ సభ్యులను శాలువా, పూలదండలతో సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు మరియు ఆర్యవైశ్య మహిళా భక్త బృందం తదితరులు ఆర్యవైశ్యులు పాల్గొన్నారు.

---

# ఘనంగా బిఆర్ఎస్ పార్టీ పట్టణ ప్రధాన కార్యదర్శి వీరేశం జన్మదిన వేడుకలు



సదాశివపేట,అక్టోబర్ 05 ( మెతుకు సీమ న్యూస్) : బిఆర్ఎస్ పార్టీ పట్టణ ప్రధాన కార్యదర్శి పిల్లిగుండ్ల వీరేశం జన్మదిన వేడుకలు శుక్రవారం పట్టణంలోని మున్సిపల్ చైర్ పర్సన్ అపర్ణ శివరాజ్ పాటిల్ నివాసంలో ఎమ్మెల్యే చింతా ప్రభాకర్ సమక్షంలో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ పార్టీ నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

# రోడ్డు భద్రత పై జిల్లా స్థాయి అధికారులతో జిల్లా కలెక్టర్ సమీక్షా





సంగారెడ్డి బ్యూరో,అక్టోబర్ 05 ( మెతుకు సీమ న్యూస్) : జిల్లాలో రోడ్డు ప్రమాదాలను నివారించడం, విలువైన ప్రాణాలను కాపాడటానికి పగడబందీ చర్యలు చేపట్టాలని జిల్లా కలెక్టర్ క్రాంతి వల్లూరు పేర్కొన్నారు. శుక్రవారం కలెక్టరేట్‌లోని మినీ సమావేశ మందిరంలో రోడ్డు భద్రత పై జిల్లా స్థాయి అధికారులతో నిర్వహించిన సమీక్షా సమావేశంలో నిర్వహించారు. జిల్లా కలెక్టర్ క్రాంతి వల్లూరు మాట్లాడుతూ, రోడ్డు ప్రమాదాలను తగ్గించడంలో రహదారి భద్రతా చర్యలు కీలకమైనవని పేర్కొన్నారు. ఈ చర్యలను తీసుకోవడంలో అన్ని శాఖల మధ్య సమన్వయం అవసరమని, ప్రతి శాఖ సమిష్టిగా పని చేయాలని సూచించారు. జిల్లాలో ప్రమాదాలు ఎక్కువగా జరిగే ప్రాంతాలను (బ్లాక్ స్పాట్లు) గుర్తించి ప్రమాదాలను నివారించేందుకు సమగ్ర చర్యలు చేపట్టాలని కలెక్టర్ ఆదేశించారు.ముఖ్యంగా లకడారం, కంది, నోవా పాన్, ముత్తంగి స్వీట్ హార్ట్ కార్నర్, రుద్రారం గీతం రోడ్, కవలం పేట్ మామిడిపల్లి ఎక్స్ రోడ్ వంటి ప్రాంతాల్లో కట్టుదిట్టమైన భద్రతా ఏర్పాట్లు చేయనన్నారు.ముఖ్యంగా ద్విచక్ర వాహనదారులు హెల్మెట్ లేకుండా వాహనాలు నడపటం ప్రధాన సమస్యగా ఉంది. వారి కోసం ప్రత్యేక అవగాహన కార్యక్రమాలను నిర్వహించాలని కలెక్టర్ సూచించారు. హెల్మెట్ ధరించడం వలన రోడ్డు ప్రమాదాల్లో తీవ్రగాయాల నుంచి రక్షణ పొందడం సాధ్యమని, దీని పై ప్రజలకు అవగాహన కల్పించేందుకు మీడియా, పాఠశాలలు, కాలేజీల సహకారం తీసుకోవాలని కలెక్టర్ తెలిపారు.రోడ్డు ప్రమాదాల నివారణకు సంబంధిత శాఖల సమన్వయం కేవలం కాగితాలపైనే కాకుండా, దృశ్యమాన చర్యల రూపంలో అమలుచేయాలని సూచించారు. ప్రత్యేకించి జాతీయ రహదారుల ప్రాధికార సంస్థ మరియు రహదారుల ఇంజనీరింగ్ అధికారులు ప్రమాదాలను నివారించేందుకు కఠిన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.మానవ తప్పిదాలు, వాహనాలు, అత్యధిక వేగం వంటి కారణాలు రోడ్డు ప్రమాదాలకు ప్రధాన కారణాలుగా ఉన్నాయని కలెక్టర్ పేర్కొన్నారు.ఈ కారణాలను తగ్గించేందుకు రోడ్లపై రుంబుల్ స్ట్రిప్స్, స్టడ్స్, సూచిక బోర్డులు, బ్లింకర్స్ వంటి రహదారి సూచనలు ఏర్పాటు చేయాలని సూచించారు. అలాగే, ప్రమాదాల నిర్వహణకు సంబంధించి అన్ని శాఖలు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. రహదారి పక్కన ఉన్న అక్రమ నిర్మాణాలు ప్రమాదాలను మరింత పెంచుతున్నాయని , వాటిని తొలగించడం అత్యవసరమని కలెక్టర్ తెలిపారు . రహదారి ఇరువైపులా నిబంధనలకు అనుగుణంగా ప్రదేశాలు ఉండేలా చూడాలని, పెట్రోల్ బంకులు, హోటళ్ల వద్ద ప్రవేశం, నిష్క్రమణ మార్గాలు సక్రమంగా ఉండేలా చూడాలని, పారిశుద్ధ్య నిర్వహణ పంచాయితీ సెక్రటరీలు సక్రమంగా చూసుకోవాలని ఆమె ఆదేశించారు.రోడ్డు భద్రతపై ప్రజలకు అవగాహన కల్పించేందుకు రోడ్డు భద్రతా మాసోత్సవం సందర్భంగా వర్క్‌షాప్‌లను నిర్వహించాలని జిల్లా కలెక్టర్ సూచించారు. ఈ వర్క్‌షాప్‌లు ప్రజలతో పాటు అన్ని వర్గాలకు, ముఖ్యంగా స్కూల్ విద్యార్థులకు, వాహనదారులకు, వ్యాపారులకు, కర్మాగార సిబ్బందికి రోడ్డు భద్రతపై అవగాహన కల్పించేందుకు ఉపయోగపడతాయని తెలిపారు.రోడ్డు ప్రమాదాలు జరిగితే సమయానికి సహాయ చర్యలు తీసుకోవడం ముఖ్యమని, హైవే మీద ప్రమాదాలు జరిగితే అంబులెన్స్ సమయానికి అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ పేర్కొన్నారు.108 సిబ్బందికి ఈ విషయంలో మరింత శిక్షణ ఇవ్వాలని, ప్రమాద సమయంలో వారు ఎలా స్పందించాలి, ప్రమాదగ్రస్తులను ఆసుపత్రికి తీసుకెళ్లడంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలు వంటి అంశాలపై ప్రత్యేక శిక్షణ ఇవ్వాలని డి ఎం అండ్ హెచ్ ఓ అధికారులకు సూచించారు. ప్రజలు రోడ్డు ప్రమాదాల బారిన పడకుండా చర్యలు తీసుకోవడం అత్యవసరం. ముఖ్యంగా గ్రామపంచాయతీ పరిధిలో ఉన్న నేషనల్ హైవే రహదారులను శుభ్రం చేయాలని, రహదారి పక్కన చెత్తను పడేయకుండా చూడాలని, అవి ప్రమాదాలకు దారితీసే అవకాశాలు ఉండవని జిల్లా కలెక్టర్ చెప్పారు. పటిష్టమైన పారిశుధ్య నిర్వహణ కోసం సంబంధిత అధికారులు కృషి చేయాలని, ప్రమాదాలు జరగకుండా ఉండేందుకు అన్ని శాఖల మధ్య సమన్వయం అత్యవసరమని పేర్కొన్నారు. జిల్లాలో రోడ్డు భద్రతా చర్యలను మెరుగుపరచడం లక్ష్యంగా, జిల్లా ఎస్పీ రూపేష్ పిపిటి ప్రదర్శన ద్వారా రోడ్డు ప్రమాదాలకు దారితీసే ప్రధాన కారణాలను వివరించారు. జిల్లాలో రోడ్డు భద్రతా చర్యలను మెరుగుపరచడం లక్ష్యంగా, జిల్లా ఎస్పీ రూపేష్ మాట్లాడుతూ ముఖ్యంగా ప్రమాదాలు ఎక్కువగా జరిగే బ్లాక్ స్పాట్లలో తీసుకోవాల్సిన చర్యలపై చర్చ జరిగింది.అధిక వేగం వల్ల ప్రమాదాలు జరుగుతున్నాయని, వేగ పరిమితిని ఖచ్చితంగా అమలు చేయాలని ఎస్పీ సూచించారు. రద్దీ ప్రాంతాల్లో ట్రాఫిక్ క్రమం తప్పకుండా నియంత్రించడంతో ప్రమాదాల నివారణకు దోహదం అవుతుందని పేర్కొన్నారు. ఈ సమావేశంలో అసిస్టెంట్ కలెక్టర్ మనోజ్, నేషనల్ హైవే అథారిటీ పీడి,ఆయా అధికారులు, ఎల్ ఎన్ టి అధికారులు, పంచాయతీరాజ్, ఆర్ అండ్ బి, వైద్య ఆరోగ్య, పంచాయితీ శాఖల అధికారులు, , ఆర్టీసీ ఆర్ ఎం,డి ఎం, తదితరులు పాల్గొన్నారు.

---

# నవరాత్రులలో భాగంగా శ్రీ తుల్జాభవాని మాతను దర్శించుకున్న రాష్ట్ర కాంగ్రెస్ నాయకులు పులిమామిడి రాజు



సదాశివపేట,అక్టోబర్ 05 ( మెతుకు సీమ న్యూస్) : నవరాత్రులను పురస్కరించుకొని మహారాష్ట్రలోని తుల్జాపూర్ గ్రామం నందు స్వయంబుగా వెలసిన శ్రీ తుల్జా భవాని మాతను కాంగ్రెస్ రాష్ట్రనాయకులు పులిమామిడి రాజు తన మిత్ర బృందంతో కలిసి తుల్జాభవాని మాతకు ప్రత్యేక అభిషేకము , అర్చన, బోగి పూజా కార్యక్రమాన్ని రోహిత్ కదం పరమేశ్వర్ పండిత్ పర్యవేక్షణలో నిర్వహించారు. తదుపరి పులిమామిడి రాజు మాట్లాడుతూ ముందుగా మహారాష్ట్ర మరియు తెలంగాణా ప్రజలందరికి దేవి నవరాత్రి మహోత్సవ శుభాకాంక్షలు తెలియ జేశారు. తుల్జాపూర్లో వెలసిన తుల్జాభవాని మాత అత్యంత శక్తివంతమైనదని అమ్మవారిని భక్తిశ్రద్ధలతో కొల్చిన వారందరికి కోరిన కోరికలు తీరుస్తుందని , ఆయురారోగ్యాలను ప్రసాదిస్తుందని అన్నారు. ఇక్కడికి కాలినడకన విచ్చేస్తున్నటువంటి భక్తులకు ఆలయ కమిటీ వారు అన్ని రకాల వసతులను ఏర్పాటు చేశారని, అమ్మ వారి దర్శనం సాఫీగా కలుగుతుందని అన్నారు. అదేవిధంగా భక్తులకు నిత్యా అన్నదాన వసతులను ఏర్పాటు చేశారన్నారు. ఇంత చక్కటి వసతులను ఏర్పాటు చేసిన మహా రాష్ట్ర ప్రభుత్వానికి, ఆలయ కమిటి సభ్యులందరికి మరియు ఏర్పాట్లను పర్యవేక్షిస్తున్న పోలీసు సిబ్బందికి , వైద్య సిబ్బందికి పులి మామిడి రాజు ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేశారు. తదుపరి ఆలయ పూజారులు పులిమామిడి రాజును శాలువాతో ఘనంగా సన్మానించి అమ్మవారి ప్రతిమను అందజేసి రాజును ఆశీర్వదించడం జరిగింది. ఇట్టి కార్యక్రమంలో ఆలయ ప్రధాన పూజారి రోహిత్ కదం పరమేశ్వర్, సందీప్ మరియు వారి మిత్రులు నర్సింలు గోల్డ్ స్మిత్, బగిలి విష్ణు వర్ధన్ రెడ్డి, తాలేల్మ రాము, షకీల్, సోమ శంకర్ పాల్గొన్నారు.

## ప్రభుత్వ బాలికల జూనియర్ కాలేజీలో బతుకమ్మ సంబరాలలో పాల్గొన్న టి జి ఐ ఐ సి చైర్మన్ నిర్మలజగ్గారెడ్డి





సంగారెడ్డి బ్యూరో,అక్టోబర్ 05 ( మెతుకు సీమ న్యూస్) : సంగారెడ్డి జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాలలో బతుకమ్మ సంబరాలలో పాల్గొన్న టి జి ఐ ఐ సి చైర్మన్ నిర్మలజగ్గారెడ్డి..కాలేజీ ప్రిన్సిపాల్ సునీత ఆధ్వర్యంలో విద్యార్థులతో కలిసి ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన బతుకమ్మ వేడుకల కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ విజయలక్ష్మిరవి, స్థానిక కౌన్సిలర్ కూన వనితసంతోష్ లతో కలిసి బతుకమ్మ సంబరాలలో తెలంగాణ పారిశ్రామిక మౌలిక సదుపాయాల సంస్థ చైర్మన్ నిర్మలజగ్గారెడ్డి పాల్గొని విద్యార్థులు ఉపాధ్యాయులుతో కలిసి బతుకమ్మ ఆడారు.

## మారేపల్లి పంచాయతీ కార్యదర్శిని సస్పెండ్ చేయాలి

### - పంచాయతీ కార్మికులపై కక్ష సాధింపు చర్యలు ఆపాలి




కొండాపూం,అక్టోబర్ 05 ( మెతుకు సీమ న్యూస్) : కొండాపూర్ మండలం మారేపల్లి గ్రామపంచాయతీ కార్మికుల మీద కక్ష సాధింపు చర్యలు ఆపాలని లిసిఐటియు కొండాపూర్ మండల కన్వీనర్ బాబురావు మాట్లాడుతూ కార్మికుల పట్ల కక్షపూరితంగా వ్యవహరిస్తూన మారేపల్లి పంచాయతీ కార్యదర్శులు సస్పెండ్ చేయాలని అన్నారులి గత 30 సంవత్సరాల నుంచి గ్రామపంచాయతీ పరిధిలో బాయికాడి వెంకయ్య పంచాయితీ కార్మికునిగా వాటర్ మెన్ గా పనిచేస్తున్న పరిస్థితి ఉందని అన్నారు, బకాయిలు వేతనాల కోసం పదేపదే ప్రశ్నిస్తున్నారని, కక్షపూరితంగా విధుల్లో నుంచి తొలగించడం జరిగిందని ఆవేదన వ్యక్తం చేశారు, గత 3 నెలల నుంచి కార్మికులకు వేతనాలు ఇప్పటికీ లేవు పండుగ పూట పస్తులు ఉండే పరిస్థితి ఉందన్నారు, అతని అంగ వైకల్యాన్ని సైతం ఏలన చేస్తూ మాట్లాడిన పరిస్థితి ఉందన్నారు, కొంతమంది గ్రామస్తులను రెచ్చగొట్టి సరిగా పనిచేయడం లేదని నేపముతోటి తొలగించడం సరైనది కాదని అన్నారు, ఒక కార్మికుని పొట్ట మీద కొట్టడం సరైన పద్ధతి కాదని అన్నారు, గ్రామాల్లో లంచాలు తీసుకొని పనిచేసే పంచాయతీ కార్యదర్శి ఝాన్సీ రాణి పంచాయతీ కార్మికుల గురించి మాట్లాడడం హాస్యాస్పదంగా ఉందని అన్నారు, తొలగించిన గ్రామపంచాయతీ కార్మికుని వెంటనే విధుల్లోకి తీసుకోవాలి, మూడు నెలల బకాయి వేతనాలు ఇవ్వాలి, పంచాయతీ కార్మికుల పట్ల కక్షపూరితంగా వ్యవహరించి, అతని అంగవైకల్యాన్ని సైతం ఏలన చేసిన మారేపల్లి పంచాయతీ కార్యదర్శి ఝాన్సీ రాణి నీ వెంటనే సస్పెండ్ చేయాలని సిఐటియు కొండాపూర్ మండల కమిటీ డిమాండ్ చేస్తుందని అన్నారు, లేనిపక్షంలో పంచాయతీ కార్మికులను ఏకము చేసి ఆందోళన కార్యక్రమాలను తీవ్రతరం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సిఐటియు నాయకులు భాస్కర్, విజయరావు, శీను, ప్రభాకర్ తదితరులు ఉన్నారు.

## నర్సాపూర్ పట్టణంలో వివిధ వార్డుల్లో తిరిగి అభివృద్ధి పనులను పరిశీలించిన ఎమ్మెల్యే సునీత లక్ష్మారెడ్డి



నర్సాపూర్,అక్టోబర్ 05 ( మెతుకు సీమ న్యూస్) : నర్సాపూర్ శాసన సభ్యురాలు, వాకిటి సునీత లక్ష్మారెడ్డి, పురపాలక సంఘం చైర్మన్ ,దుర్గప్ప అశోక్ గౌడ్ , కలిసి నర్సాపూర్ పట్టణంలోని వివిధ అభివృద్ధి పనులను పరిశీలించడం జరిగింది. ఇందులో భాగంగా 8వ వార్డు యందు తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వము ప్రతిష్టాత్మకంగా ప్రవేశపెట్టిన ఫ్యామిలీ డిజిటల్ కార్డు పైలట్ ప్రాజెక్టు సర్వే పనులు పరిశీలించడం జరిగింది. అనంతరము ఎనిమిదో వార్డులోని అంగన్వాడీ కేంద్రం యందు పిల్లలకు మరియు గర్భిణీలకు అందుతున్న పౌష్టికాహారము మరియు ఇతర అంశములు పరిశీలించడం జరిగింది. తదనంతరం పోస్ట్ ఆఫీస్ వద్ద పెన్షన్ల పంపిణీ కార్యక్రమాన్ని పరిశీలించడం జరిగింది. ఇట్టి కార్యక్రమంలో మున్సిపల్ కౌన్సిలర్ , గొల్ల రుక్కమ్మ పంబల రామచందర్ మేనేజర్, వి మధుసూదన్, సానిటరీ ఇన్స్పెక్టర్ సల్ల మురళీమోహన్, వార్డు అధికారులు ఆంజనేయులు, సురేష్, రాములు, రణదీప్, శైలజ, ఉదయ్ మరియు పురపాలక సిబ్బంది, ఇతర నాయకులు పట్టణ ప్రజలు పాల్గొనడం జరిగింది.

## క్వారీ గుంతలో పడి వ్యక్తి మతి



నారాయణఖేడ్,అక్టోబర్ 05 ( మెతుకు సీమ న్యూస్) : బట్టలు ఉతకడానికి వెళ్లి క్వారీ గోతిలో పడి ఓవ్యక్తి మృతిచెందిన సంఘటన ఖేడ్ మండలం హంగర్గా(కె) శివారులో చోటు చేసుకుంది. గ్రామస్తులు తెలిపిన వివరాల ప్రకారం.. హంగర్గా(కె) శివారులో కంకర క్రషర్ ఉంది. రాళ్ల కోసం పలుచోట్ల ఇష్టానుసారం తవ్వకాలు చేపట్టగా పెద్దపెద్ద గోతులు ఏర్పడ్డాయి. ఇటీవల పలుమార్లు కురిసిన భారీవర్షాలతో ఆయాగోతులు నీటితో నిండాయి. గ్రామానికి చెందిన చాకలి హన్మంతు (50) గురువారం గోతుల్లో నిండి ఉన్న నీటిలో బట్టలు ఉతకడానికి వెళ్లాడు. ప్రమాదవశాత్తు గోతిలో పడి గల్లంతయ్యాడు. గాలించినా ఆచూకీలభ్యం కాకపోగా శు క్రవారం ఉదయం మృతదేహం నీటిలో తేలింది. ఎలాంటి ఈవిషయంలో తమకు ఫిర్యాదు రాలేదని ఖేడ్ పోలీసులు తెలిపారు. గ్రామంలో ఎలాంటి అనుమతుల లేకుండా ఏర్పాటు చేసిన కంకర క్రషన్‌ను తొలగించాలని, వ్యక్తి మృతికి కారకుడైన యజానిపై కేసునమోదు చేసి కఠిన చర్యలు తీసుకోవాలని గ్రామస్థులు డిమాండ్ చేశారు. మృతుడికి కుటుంబానికి ఆర్థిక సహాయం అందజేసి ఆదుకోవాలని కోరారు.

## అపరిచిత వ్యక్తుల యొక్క ఫోన్ కాల్స్ మాటలు నమ్మవద్దు-ఇన్స్పెక్టర్ సైదా




గజ్వేల్ రూరల్,అక్టోబర్ 05 ( మెతుకు సీమ న్యూస్) : బిఎంఆర్ డిగ్రీ కాలేజ్ గజ్వేల్ విద్యార్థినీ విద్యార్థులకు మహిళల రక్షణ చట్టాల గురించి, ర్యాగింగ్ ఇవిటీజింగ్ పోక్సో షీ టీమ్స్ యాంటీ హ్యూమెన్ ట్రాఫికింగ్ సైబర్ నేరాలు,నూతన చట్టాల గురించి అవగాహన కల్పించిన గజ్వేల్ ఇన్స్పెక్టర్ సైదా గజ్వేల్ షీటీమ్ బృందం ఈ మధ్యకాలంలో జరిగిన రోడ్డు ప్రమాదాలన్నీ హెల్మెట్ లేకపోవడం మద్యం సేవించి వాహనాలు నడపడం వల్ల జరిగాయి. విద్యార్థి దశ కీలకం జీవితంలో మళ్లీ ఎప్పుడు రాదు ఏం సాధించాలన్నా ఇప్పటి నుండే ప్రణాళికలు తయారు చేసుకోవాలి. సోషల్ మీడియాకు ఎంత దూరం ఉంటే భవిష్యత్ అంత మంచిగా ఉంటుంది.మహిళల భద్రతకు ఎల్లవేళలా అందుబాటులో ఉంటాం మహిళల భద్రత మా ముఖ్య బాధ్యత ఈ సందర్భంగా గజ్వేల్ ఇన్స్పెక్టర్ సైదా,మాట్లాడుతూలి చదువుకునే సమయములో చెడు అలవాట్లకు బానిస కావొద్దు అన్నారు,ప్రతి ఒక్కరూ చదువుపై దృష్టి సారించాలని తెలిపారు, డ్రగ్స్ ఇతర మత్తు పదార్థాలపై అప్రమత్తంగా ఉండాలన్నారు.చదువుకోవడం వలన భవిష్యత్తు ఉన్నతంగా ఉంటుందని అన్నారు.పిల్లలను చదివించటానికి తల్లిదండ్రులు చేస్తున్న కష్టాన్ని మనసులో పెట్టుకొని చదువుపై శ్రద్ధ వహించాలని సూచించారు. కష్టపడి చదవాల్సిన వయస్సులో చెడు అలవాట్లకు బానిసలు కావద్దని సూచించారు,కష్టపడి చదువుకుని ఉన్నత స్థానాల్లో స్థిరపడాలని ఆకాంక్షించారు. నూతన చట్టాలతో మహిళల రక్షణకు పెద్దపీట వేయడం జరిగింది.నూతన చట్టాలలో నేరం చేసిన నేరస్తులకు కఠినమైన శిక్షలు అమలు చేయడం జరుగుతుందన్నారు. బాధితులకు అండగా చట్టాలు నిలుస్తాయని పేర్కొన్నారు.మహిళలు పిల్లలు ఎవరితోటైనా హింసకు ఎవరైనా హేళనంగా మాట్లాడిన మౌనం వీడి తల్లిదండ్రులకు కానీ స్నేహితులకు కానీ చెప్పుకోవాలని సూచించారు. లేనిపక్షంలో డయల్-100 కు కాల్ చేసి తక్షణ పోలీస్ సహాయం పొందాలని సూచించారు. మహిళల పిల్లల రక్షణకు పెద్దపీట వేయడం జరుగుతుందన్నారు. పిల్లలు మహిళలు ఏమైనా సమస్యలు ఇంట్లో కానీ బయట కానీ ఎదుర్కొంటే వెంటనే షిటీమ్ వాట్సప్ నెంబర్ 8712667343 మహిళా పోలీస్ స్టేషన్ నెంబర్ 8712667435, సమాచారం అందించాలని, సమాచార అందించిన వారి పేర్లు గోప్యంగా ఉంచడం జరుగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో కాలేజీ ఇంచార్జి ప్రిన్సిపల్ శిరీష, అధ్యాపకులు,గజ్వేల్ షీటీమ్ ఏఎస్ఐ శ్రీరాములు,మహిళా కానిస్టేబుల్ శ్యామల, కానిస్టేబుల్ రామచంద్రారెడ్డి పోలీస్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## గజ్వేల్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ట్రాఫిక్ రూల్స్ పై అవగాహన-ట్రాఫిక్ ఇన్స్పెక్టర్ యం.మురళి




గజ్వేల్ రూరల్,అక్టోబర్ 05 ( మెతుకు సీమ న్యూస్) : ప్రభుత్వ డిగ్రీ కళాశాల గజ్వేల్ లో 33 తెలంగాణ బెటాలియన్ సంగారెడ్డి వారి ఆధ్వర్యంలో నిర్వహించబడుతున్న ఎన్ సి సి కంబైండ్ ఆన్యువల్ ట్రైనింగ్ క్యాంప్ లో భాగంగా ఈరోజు ఎన్సిసి విద్యార్థులకు గజ్వేల్ పట్టణ ట్రాఫిక్ సిఐ యం.మురళి అవగాహన కల్పించారు. ట్రాఫిక్ రూల్స్ పై అవగాహన లేకుండా వాహనాలు నడపడం చట్టరీత్యా నేరం మాత్రమే కాకుండా ప్రమాదాల బారిన పడడం జరుగుతుందని తెలిపారు.ద్విచక్ర వాహనాలు కొనుగోలు చేసిన సందర్భంలోనే తప్పకుండా హెల్మెట్ కూడా కొనాలని హెల్మెట్ లేకుండా ఎట్టి పరిస్థితుల్లో వాహనాలు నడపరాదని సూచించారు.హెల్మెట్ ధరించడం వల్ల ప్రమాదాలు జరిగినప్పుడు ప్రాణాపాయ స్థితి నుండి తప్పించుకోవచ్చని సూచించారు.విద్యార్థులు తమ కుటుంబ సభ్యులతో హెల్మెట్ లేకుండా నడపనని ప్రమాణం చేయించాలని, పుట్టినరోజు వంటి వేడుకలకు హెల్మెట్ బహుమతి గా ఇవ్వాలని తెలిపారు.18 సంవత్సరాల తరువాత వాహనం నడిపే ప్రతి ఒక్కరు లైసెన్స్ తీసుకోవాలని కోరారు. ట్రాఫిక్ నిబంధన అతిక్రమించిన వారిపై కేసులు నమోదు చేయబడడంవలన ఉద్యోగ నియామకాల సమయం లో ఇబ్బంది ఎదురవుతుందని సూచించారు.పెద్దలు లేనప్పుడు మైనర్ బాలబాలికలు వాహనాలు నడపవద్దని అలా నడిపినప్పుడు మైనర్ తో పాటు వాహనం యజమాని పై కేసు నమోదు చేయబడుతుందనికాబట్టి జాగ్రత్తగా ఉండాలని హెచ్చరించారు. మద్యపానం సేవించి నడపడం వలన ప్రమాదం తీవ్రత ఎక్కువ ఉంటుందని మద్యపానం చేసిన తర్వాత వాహనాలు నడపరాదని తెలిపారు. ట్రాఫిక్ నియమాలు పాటించకుండా వాహనాలు నడపడం వలన వాహనం నడిపే వ్యక్తి తో పాటు సాధారణ ప్రజలు కూడా ప్రమాదబారిన పడతారని తెలిపారు.ప్రమాదాల కారణంగా కుటుంబ పెద్దలు మరణించినప్పుడు కుటుంబమంతా విచ్ఛిన్నమవుతుందని వారి పిల్లల భవిష్యత్తు నాశనం అవుతుందని తెలియజేశారు. డ్రంక్ అండ్ డ్రైవ్ లో పట్టుబడిన వారిపై తప్పకుండా కేసులు నమోదు చేయబడుతాయి.తద్వారా వారి లైసెన్స్ రద్దు చేయబడడం భవిష్యత్ లో ప్రభుత్వ ఉద్యోగానికి అనర్హత పొందడం జరుగుతుంది జాగ్రత్తగా ఉండాలని కోరారు.రాంగ్ సైడ్ డ్రైవింగ్, త్రిపుల్ రైడింగ్ వంటివికూడా ప్రమాదాలకి దారి తీస్తాయని సూచించారు.యువత అవసరానికి మించి ఫోన్ వాడడం వల్ల అనుకున్న లక్ష్యాన్ని సాధించలేరని అవసరం మేరకు మొబైల్ వాడుకొనిలక్ష్యాన్ని నిర్దేశించుకుని అందుకు కృషి చేయాలని తెలిపారు శారీరకంగా మానసికంగా దృఢంగా ఉండి అనుకున్న లక్ష్యాన్ని సాధించడానికి మార్గం సుగమవుతుందని అభినందించారు.ఈ కార్యక్రమం అనంతరం 33 బెటాలియన్ సంగారెడ్డి ఆడం ఆఫీసర్ లెఫ్టినెంట్ కల్నల్ పి ఎం ఎస్ రావు గారు సి ఐ యం. మురళి గారికి మెమెంటో తో సత్కరించారు.ఈ కార్యక్రమంలో సుబేదార్ మేజర్ రామ్ హరి ఎ ఏన్ ఓ లెఫ్టినెంట్ డాక్టర్ ఆర్ మహేందర్ రెడ్డి ఎన్సిసి క్యాడేట్స్ పాల్గొన్నారు.

## తుల్జాపూర్ పాదయాత్ర కు బయలుదేరిన భక్తులు




ఝరాసంగం,అక్టోబర్ 05 ( మెతుకు సీమ న్యూస్) : ఝరాసంగం నుండి తుల్జాపూర్ పాదయాత్ర కు బయలుదేరిన భక్తులు శుక్రవారం కేతకి ఆలయాన్ని దర్శించుకుని పాదయాత్ర గా బయలుదేరిన ఝరాసంగం భక్తులు ఈ కార్యక్రమం లో రాజశేఖర్ కిషోర్ కుమార్ శివ కుమార్ మల్లికార్జున్ మహేష్ తదితరులు పాల్గొన్నారు.

# పోలీసుల ప్రతిభను వెలికి తీయడానికే పోలీసు డ్యూటి మీట్

- రాష్ట్ర స్థాయి డ్యూటి మీట్ నందు సత్తా చాటాలి
- పోలీసు డ్యూటి మీట్ సందర్భంగా జిల్లా పోలీసు కార్యాలయాన్ని సందర్శించిన మల్టీ జోన్-2 ఐ.జి. వి.సత్యనారాయణ




సంగారెడ్డి బ్యూరో,అక్టోబర్ 05 ( మెతుకు సీమ న్యూస్) : జోనల్ స్థాయి పోలీస్ డ్యూటీ మీట్ సందర్భంగా శుక్రవారం నాడు సంగారెడ్డి జిల్లా పోలీసు కార్యాలయాన్ని సందర్శించిన మల్టీ జోన్-2 ఐ.జి వి.సత్యనారాయణ ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ.. గత నెల 25,26 తేదీలలో జిల్లా స్థాయి డ్యూటీ మీట్ నిర్వహించి, అందులో ఉత్తమ ప్రతిభ కనబరిచిన వారిని జోనల్ స్థాయి డ్యూటీ మీట్ కు సెలెక్ట్ చేయడానికి, గత రెండు రోజులుగా సంగారెడ్డి, వికారాబాద్ జిల్లాకు చెందిన అధికారులు, సిబ్బందికి జోనల్ లెవెల్ డ్యూటీ నిర్వహించడం జరిగిందని జిల్లా ఎస్పీ వివరించారు. అనంతరం ఐజి మాట్లాడుతూ.. పోలీసుల ప్రతిభను వెలికి తీయడానికే పోలీసు డ్యూటి మీట్.. నిర్వహించడం జరుగుతుందని ఈ డ్యూటీ మీట్ నందు సైంటిఫిక్ ఎవిడెన్స్, నేరం జరిగిన తర్వాత నేరస్థలాన్ని ఏ విధంగా ప్రొటెక్ట్ చేయాలి, నేరస్థలం నందు క్లూస్ ఏ విధంగా సేకరించాలి, కంప్యూటర్ పరిజ్ఞానం, మరియు బాంబ్ స్క్వాడ్, డాగ్ స్క్వాడ్ పని తీరుపై పరీక్షలు నిర్వహించడం జరిగిందని అన్నారు. ఈ నెల 14 నుంచి 18 తేదీలలో జరిగే స్టేట్ లెవెల్ డ్యూటీ మీట్ నందు సత్తా చాటి, అనంతరం రాంచీలో జరిగే నేషనల్ స్థాయి డ్యూటి మీట్ కు అర్హత సాధించాలి అన్నారు. పోలీసులకు పేరు తీసుకువచ్చేది ఇన్వెసిగేషన్ అని ఈ డ్యూటి మీట్ ద్వారా ఇన్వెసిగేషన్ లో మెళకువలు నేర్చుకోవచ్చు అన్నారు. సరైన పద్ధతిలో ఇన్వెసిగేషన్ చేసి కేసును డిటెక్ట్ చేసినట్లయితే పనితీరును గుర్తించడం జరుగుతుందని అన్నారు. అనంతరం డిస్టిక్ లెవెల్ మరియు జోనల్ లెవెల్ లో ఉత్తమ ప్రతిభ కనబరిచిన వారికి అవార్డులు అందించడం జరిగింది. సంగారెడ్డి జిల్లా పోలీస్ డ్యూటీ నందు హనుమంతు ఇన్స్పెక్టర్, జహీరాబాద్ రూరల్ మొదటి స్థానంలో నిలవగా, విద్యాచరణ్ రెడ్డి ఎస్ఐ నారాయణ్ ఖేడ్ ద్వితీయ స్థానం, హరిశంకర్ రెడ్డి తృతీయ స్థానంలో నిలిచారు. అదేవిధంగా జోనల్ లెవెల్ మీట్ నందు విద్యాచరణ్ రెడ్డి ఎస్ఐ నారాయణ్ ఖేడ్ మొదటి స్థానంలో నిలవగా, రఘురాం ఇన్స్పెక్టర్ వికారాబాద్ ద్వితీయ స్థానం, హరిశంకర్ రెడ్డి తృతీయ స్థానంలో నిలిచారు. ఈ కార్యక్రమంలో సంగారెడ్డి జిల్లా డ్యూటి మీట్ నోడల్ అధికారి అదనపు ఎస్పీ ఎ.సంజీవ రావ్, జహీరాబాద్ డియస్పి రామ్ మోహన్ రెడ్డి, ఎ.ఆర్.డియస్పి నరేందర్, వికారాబాద్ డ్యూటి మీట్ నోడల్ అధికారి ఎ.ఆర్.డియస్పి వీరేష్, యస్.బి ఇన్స్పెక్టర్స్ విజయ్ కృష్ణ, డీసీఆర్బీ ఇన్స్పెక్టర్స్ రమేష్ డ్యూటి మీట్ అధికారులు సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

---

# అధికారులకు ప్రభుత్వ గుర్తింపు పొందిన జర్నలిస్టుల వివరాలు అందజేత



గుమ్మడిదల,అక్టోబర్ 05 ( మెతుకు సీమ న్యూస్) : జిల్లా కలెక్టర్ ద్వారా ప్రభుత్వ గుర్తింపు పొంది అక్రిడిటేషన్ కలిగి ఉన్న జర్నలిస్టులకు మాత్రమే అధికారిక సమాచారాలను అందించాలని, అదేవిధంగా మీడియా పేరుతో వరుస అకృత్యాలకు పాల్పడుతున్న కొందరు వ్యక్తులపై తగిన విధంగా చర్యలు తీసుకోవాలని కోరుతూ శుక్రవారం గుమ్మడిదల మండల జర్నలిస్టులు అధికారులను కలిసి విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు శుక్రవారం గుమ్మడిదల డిప్యూటీ తాహసిల్దార్ కర్ణాకర్ రావు, ఎస్సై మహేశ్వర్ రెడ్డి తో పాటు ఇతర ప్రభుత్వ అధికారులను కలిసి జర్నలిస్టులు వృత్తిపరంగా ఎదురవుతున్న సమస్యలను విన్నవించి సహకరించాలని అధికారులను కోరారు. దీనికి ఆయా శాఖల అధికారులు సానుకూలంగా స్పందించి తమ పూర్తి సంపూర్ణ సహకారాన్ని అందిస్తానని తెలిపారు. ఈ సందర్భంగా జర్నలిస్టుల వివరాల లిస్టును అధికారులకు స్వయంగా పటాన్చెరువు నియోజకవర్గ అర్హులైన అక్రిడేషన్ కలిగిన జర్నలిస్టులు కలిసి అందజేశారు. కార్యక్రమంలో ప్రింటు మీడియా ఎలక్ట్రానిక్ జర్నలిస్టులు తదితరులు పాల్గొన్నారు.

---

# యువత స్వయం ఉపాధి ద్వారా ఆదాయపు మార్గాల వైపు పయనించడం హర్షణీయం

- గుమ్మడిదల మండలం బొంతపల్లి గ్రామంలో హొటల్ మరియు రియల్ ఎస్టేట్ ఆఫీస్ ప్రారంభించిన నీలం మధు ముదిరాజ్






నర్సాపూర్,అక్టోబర్ 05 ( మెతుకు సీమ న్యూస్) : టీపీసీసీ సెక్రటరీ శ్రీనివాస్ రెడ్డి మరియు గుమ్మడిదల మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు నర్సింగ్ రావు, ప్రతాప్ రెడ్డి ,తో గుమ్మడిదలలో మర్యాదపూర్వకంగా భేటీ అయి పలు విషయాలపై చర్చించడం జరిగింది. యువత ఉద్యోగం ఒకటే కాకుండా సొంతంగా స్వయం ఉపాధి మార్గాలు ఎంచుకుని ఆదాయం పొందే విధంగా నూతన వ్యాపారాలు ప్రారంభించడం హర్షినియమని కాంగ్రెస్ పార్టీ మెదక్ పార్లమెంట్ కంటెస్టెడ్ క్యాండిడేట్ నీలం మధు ముదిరాజ్ అన్నారు. గుమ్మడిదల మండలం బొంతపల్లి కామన్ వద్ద దోమడుగు గ్రామానికి చెందిన ఎన్ఎంఆర్ యువసేన సభ్యులు భరత్ శెట్టి రాఘవేంద్ర భవన్ హొటల్ మరియు నాగరాజు, నూతన రియల్ ఎస్టేట్ ఆఫీస్ ను ఆయన ముఖ్యఅతిథిగా హాజరై ప్రారంభించారు. ఈ సందర్భంగా నీలం మధు మాట్లాడుతూ యువత స్వయం ఉపాధి ద్వారా ఆదాయపు మార్గాలు ఎంచుకోవడంతో తమ కాలమీద తామే నిలబడడంతో పాటు మరికొందరికి ఉపాధి కల్పించడానికి అవకాశం ఉంటుందన్నారు. భారత్ శెట్టి మరియు నాగరాజు ప్రారంభించిన ఈ వ్యాపారం అభివృద్ధి చెందాలని ఆయన అభిలాషించారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ తిరుమలవాసు, నర్సింలు,గారెల మల్లేష్, తుడుం శ్రీనివాస్, రవి చారి, నర్సింలు, వెంకటేష్, శంకర్,బిక్షపతిరెడ్డి, వీరేష్, అశోక్, హుస్సేన్, మోసిన్, సురేష్, శేఖర్,కాంగ్రెస్ కుటుంబ సభ్యులు,ఎన్ఎంఆర్ యువసేన సభ్యులు, తధితరులు పాల్గొన్నారు.

# మురికి కాలువలను శుభ్రపరుస్తున్న గ్రామపంచాయతీ కార్మికులు



పుల్కల్,అక్టోబర్ 05 ( మెతుకు సీమ న్యూస్) : మండల కేంద్రమైన పుల్కల్ గ్రామంలో మూర్కి కాలువలు నుండి అట్టి మురికి నీరు రోడ్లపై ప్రవహిస్తుండడంతో వాటిపై దోమ లు ను స్వేర విహారం చేయడంతో అట్టి దోమల కాటు వల్ల గ్రామ ప్రజలు చాలామంది రోగాల బారిన పడ్డారు ఇట్టి విషయాన్ని గ్రామ కార్యదర్శి దృష్టికి తీసుకువెళ్లగా వెంటనే ఆయన స్పందించి శుక్రవారం నాడు గ్రామపంచాయతీ కార్మికుల చేత అట్టి మురికి కాలువలను శుభ్రం చేయించారు అంతేకాకుండా గ్రామంలో ఎక్కడ మురుగునీరు నిలవకుండా తగిన చరలు తీసుకుంటున్నామని గ్రామ కార్యదర్శి తెలిపారు ఇకనుండి పుల్కల్ గ్రామంలో ఉన్న మురికి కాలువలను త్వరితగతినపేరుకుపోయిన మురికిని పంచాయతీ కార్మికుల చేత అన్ని వార్డుల్లో ఉన్న మురికి కాలువలను శు భ్రం చేయిస్తామని ఆయన అన్నారు అంతేకాకుండా గ్రామంలో ఎలాంటి సమస్యలు ఉన్న అట్టి సమస్యలను త్వరి తగతిన పరిష్కరించే దిశగా తాము పని చేస్తామన్నారు అనునిత్యం ప్రతిరోజు ప్రజలకు అందుబాటులో ఉండి వారి సమస్యలను వెనువెంటనే పరిష్కరిస్తామని ఆయన అన్నారు గ్రామ అభివృద్ధే ధ్యేయంగా తాము పని చేస్తామన్నారు కావున గ్రామ ప్రజలు తమకు సహకరిస్తే గ్రామంలో ఎలాంటి సమస్యలు లేకుండా. ఇకముందు కూడా ఏ లాంటి సమస్యలు తలెత్తకుండా అన్ని విధాలుగా తాము పని చేయడానికి సిద్ధంగా ఉన్నానన్నారు కావున గ్రామ ప్రజలు తమకు సహకరించాలని ఆయన కోరారు.

---

# డీఎస్సీ కి ఎంపికైన సర్టిఫికెట్ విచారణ - అదనపు కలెక్ట్ వెంకటేశ్వర్లు



మెదక్ జిల్లా ప్రతినిధి,అక్టోబర్ 05 ( మెతుకు సీమ న్యూస్) : డి ఎస్సి 2024 లో అర్హత సాధించిన 1:3 నిష్పత్తిలో అభ్యర్థుల ధ్రువీకరణ పత్రాల పరిశీలన ప్రక్రియ పక్కాగా వేగవంతం గా చేపట్టాలని జిల్లా అదనపు కలెక్టర్ వెంకటేశ్వర్లు తెలిపారు. డి.ఎస్సి 2024 లో 704 ఎంపికయ్యారని 1:3 నిష్పత్తిలో అభ్యర్థుల ధ్రువీకరణ పత్రాల పరిశీలన కార్యక్రమం స్థానిక జిల్లా కేంద్రంలోని బాలుర జూనియర్ కళాశాలలో జరుగుతుండగా గురువారం అదనపు కలెక్టర్ వెంకటేశ్వర్లు స్వయంగా సందర్శించి పరిశీలించారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ ఉపాధ్యాయ నియామక ప్రక్రియ కి సంబందించి అర్హత సాధించిన అభ్యర్థుల ధృవీకరణ పత్రాల పరిశీలన పక్కాగా చేపట్టాలన్నారు. క్వాలిఫై అయిన అభ్యర్థులతో కలెక్టర్ మాట్లాడారు. కౌంటర్లను పరిశీలిస్తూ తగు సూచనలు ఇచ్చారు. ధ్రువీకరణ పత్రాల పరిశీలన కొరకు చేపట్టిన ఏర్పాట్లను కలెక్టర్ జిల్లా విద్యాశాఖ అధికారి ని అడిగి తెలుసుకున్నారు. ఎస్ ఏ (స్కూల్ అసిస్టెంట్లు)లకు ఎస్ జి టి టసెకండరీ గ్రేడ్ టీచర్లుఊ లకు తెలుగు హిందీ పండిట్ లకు పీఈటి లకు 13 కౌంటర్లను ఏర్పాటు చేసినట్లు వివరించారు .704 మంది అభ్యర్థులకు గాను 618 మంది అభ్యర్థుల ధ్రువ పత్రాల పరిశీలన పూర్తి అయ్యిందని మిగతా వారు రేపు హాజరు కావచ్చని డీఈవో తెలిపారు .ఈ కార్యక్రమంలో జిల్లా విద్యాశాఖ అధికారి రాధాకృష్ణ ఈ డిస్టిక్ మేనేజర్ సందీప్ అన్ని మండలాల విద్యాశాఖ అధికారులు గెజిటెడ్ హెచ్ఎంలు స్కూల్ అసిస్టెంట్ క్యాడర్ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

---

# బతుకమ్మ పండుగ సందర్భంగా తెలంగాణ రాష్ట్ర ఆడబిడ్డలందరికి శుభాకాంక్షలు

- రాయికోడ్ మండల బీఆర్ఎస్ పార్టీ యువనాయకుడు దాడువై పవన్ కుమార్



రాయికోడ్,అక్టోబర్ 05 ( మెతుకు సీమ న్యూస్) : తెలంగాణ అస్తిత్వానికీ సాంస్కృతిక జీవనానికి ప్రతీక బతుకమ్మ పండుగ సందర్భంగా తెలంగాణ రాష్ట్ర ప్రజలకు రాయికోడ్ మండలం బీఆర్ఎస్ పార్టీ యువనాయకుడు దాడువై పవన్ కుమార్ శుభాకాంక్షలు తెలిపారు ప్రకృతిని పూలను దేవతగా కొలిచే బతుకమ్మ పండుగ ప్రపంచ సంస్కృతీ సాంప్రదాయాల్లోనే ప్రత్యేకతను చాటుకుందన్నారు. తర తరాలుగా మహిళా సామూహిక శక్తికి ఐక్యతకు దర్పణమైన బతుకమ్మ పండుగ తెలంగాణ రాష్ట్ర సాధనకోసం సాగిన సాంస్కృతిక ఉద్యమంలో అన్ని వర్గాల ప్రజల అస్తిత్వ ఆకాంక్షలకు వేదికగా నిలిచిందని దాడువై పవన్ కుమార్ తెలిపారు ఎంగిలి పూలతో ప్రారంభమై సద్దుల తో ముగిసే తొమ్మిది రోజుల బతుకమ్మ సందర్భంగా పల్లెలు పట్టణాలు బేధం లేకుండా మహిళలతో పిల్లా పాపలతో ప్రత్యేక సందడి నెలకొంటుందని. పవన్ కుమార్ గారు తెలిపారు. బతుకమ్మ పండుగ విశిష్టతను ప్రాశస్త్యాన్ని గుర్తించిన నాటి బీఆర్ఎస్ ప్రభుత్వం బతుకమ్మ'ను రాష్ట్ర పండుగగా ప్రకటించిందని తెలిపారు. మహిళల ప్రత్యేక పండుగగా గుర్తించి బతుకమ్మ సందర్భంగా ప్రత్యేక కానుకలను కూడా అందజేసిన విషయాన్ని యువనాయకుడు దాడువై పవన్ కుమార్ గుర్తుచేసుకున్నారు. తొమ్మిది రోజులపాటు బతుకమ్మ పండుగను ఆటా పాటలతో ఆనందోత్సాహాల నడుమ జరుపుకోవాలని తెలంగాణ ఆడబిడ్డలను పవన్ కుమార్ కోరారు రాష్ట్ర ప్రజల జీవితాల్లో ప్రకృతి మాత బతుకమ్మ వెలుగులు నింపాలని ప్రార్థించారు మళ్ళీ ఒక్కసారి ఆడబిడ్డలందరికి బతుకమ్మ పండుగ శుభాకాంక్షలు తెలియజేస్తున్నాను అని రాయికోడ్ మండల బీఆర్ఎస్ పార్టీ యువనాయకుడు దాడువై పవన్ కుమార్ తెలిపారు.

## జైన విగ్రహన్ని దొంగిలించిన దొంగలను చాకచక్యంగా పట్టుకొనిరిమాండ్ కు తరలించిన టేక్మాల్ పోలీసులు




టేక్మాల్,అక్టోబర్ 05 ( మెతుకు సీమ న్యూస్) : మెదక్ జిల్లా టేక్మాల్ మండల పరిధిలో ని వేల్పుగొండ గ్రామం శివారులో ఉన్నా వెయ్యేళ్ల చరిత్రగల పార్శనాథ విగ్రహన్ని దొంగిలించిన యూవ కులు ఉన్నతమైన చదువులు చదివి చెడు వ్యాసనాలకు బానిసలై అత్యాశతో ఉన్నపలంగా రాత్రికీ రాత్రి గొప్పవారు కావాలని చెడు ఉద్దేశంతో అదే పురాతనమైన విగ్రహం అమ్మితే చాలా డబ్బులు సంపాదించవచ్చని బీటెక్ చదివిన ఐదు మంది కలసి అమ్ముటకు ప్రయత్నం చేశారు,అదే సమయంలో పోలీసు వారు వారిని చాకచక్కంగా వాళ్లని పట్టుకొని విగ్రహాన్ని స్వాధీనం పరుచుకున్నారు. వేల్పుల్పుగొండ గ్రామానికి చెందిన బోయిని నారాయణ ఆ గ్రామంలో అతి పురాతనమైన జైన మత విగ్రహంలో ఎవరో గుర్తు తెలియని వ్యక్తులు దుంగిలించారు అని టేక్మాల్ పోలీస్ స్టేషన్లో కంప్లైంట్ ఇవ్వగా కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేపట్టారు దీని విషయంలో జిల్లా ఎస్పీ ఆదేశాల మేరకు ఒక టీం ఏర్పాటు చేసి నేరస్థులను కోర్టు ముందు హాజరు పరుస్తామన్నారు.నేరస్థుల వివరాలు 1) చిలుకూరి ఆనంద్ 2) పోలిశెట్టి తేజ సాయి,3) మహేష్ బాబు ,4) తోట జగత్ 5) బందెల శుభన్ వీరందరిది ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంగా గుర్తించారు, మెదక్ జిల్లా టేక్మాల్ పోలీస్ స్టేషన్ కు వారు నేరంను అంగీకరించారు పైన తెలిపిన వారందరూ మిత్రులు మీరందరూ వేల్పుగొండ గ్రామానికి వచ్చి అక్కడ గల విగ్రహాన్ని చూసి వెళ్ళిపోయారు తేదీ/26/2024,27/ జూలై /24 మధ్య రాత్రి ఒక వెహికల్ తీసుకొని వేల్పుగొండ గ్రామానికి వచ్చి విగ్రహాన్ని తీసుకొని వెళ్ళిపోయారు అప్పటీ నుండి విగ్రహంలో అమ్ముటకు సరైన ధర దొరకక అమ్మ లేదు.4/10/2024 అనగా ఈరోజు విగ్రహం అమ్మడానికి ప్రయత్నం జరుగుతుందని టేక్మాల్ ఎస్సై గారికి సమాచారం అందగా తన సిబ్బందిని తీసుకొని వారిని పట్టుకోవడం జరిగింది. మరియు విగ్రహమును స్వాధీనం చేసుకున్నాడు ఇట్టి విగ్రహములు గ్రామస్తులకు కోర్టులో ఆధారాన్ని జమ చేసి నేరస్తులకు శిక్ష పడే విధంగా 90 రోజులు చార్జి సీట్ దాఖలు చేశామన్నారు ఈ ప్రెస్మీట్లో ఎస్పీ ఉదయకుమార్, డీఎస్పీ ప్రసన్నకుమార్, సిఐ రేణుక, ఎస్ఐ రాజేష్,పోలీస్ సిబ్బందిపాల్గొన్నారు.

---

## జన బాహుళ్యంలో ఉపాధ్యాయులుండాలి

- అంతరాలు లేని కామన్ స్కూల్ విధానాన్ని ప్రవేశపెట్టాలి
- విద్యపై బడ్జెట్ కేటాయింపులు పెరగాలి




సంగారెడ్డి బ్యూరో,అక్టోబర్ 05 ( మెతుకు సీమ న్యూస్) : ప్రాథమిక పాఠశాలల నుండి యూనివర్సిటీ విద్య వరకు విద్య నిర్లక్ష్యానికి గురి అవుతుంది టీ పి టీ ఎఫ్ సంగారెడ్డి జిల్లా శాఖ ఆధ్వర్యంలో, జిల్లా ప్రధాన కార్యదర్శి అనుముల రాంచందర్ అధ్యక్షతన విద్యా సదస్సు, ఆత్మీయ కలయిక కార్యక్రమం నిర్వహించారు. రాష్ట్ర నలుమూలల నుండి అనేకమంది ఉపాధ్యాయులు మేధావులు ప్రజాసంఘాల నాయకులు హాజరయ్యారు. ఈ కార్యక్రమంలో తెలంగాణలో విద్య అనే అంశంపై ప్రొఫెసర్ లక్ష్మీ నారాయణ గారు ఉపన్యసించారు. రాష్ట్రంలోనూ దేశంలోనూ విద్య నిర్లక్ష్యానికి గురి అవుతుందని తెలియచేశారు.రాష్ట్రంలోని విద్యా విధానం సమూలంగా మారాలని ముఖ్యంగా అంతరాలు లేని అందరికీ సమాన విద్య అందించాలని అన్నారు.రాష్ట్ర బడ్జెట్ లో విద్యపై కేటాయింపులు పెంచకుండా నాణ్యమైన విద్య సాధ్యం కాదని అన్నారు. రాష్ట్రంలో ఎక్కడ చూసినా అనేక పాఠశాలలు ప్రహరీలు లేక విద్యార్థులు పాము కాటుకు గురి అయ్యి చనిపోతున్నారనే వార్తలు చాలా బాధిస్తున్నాయి. యూనివర్సిటీలు సైతం నిధుల లేమితో భవనాలు శిథిలావస్థలో ఉన్నాయని, వీటిని బాగు చేయకుండా విద్యను బాగు చేయడం సాధ్యపడదని అన్నారు..ఫెడరేషన్ గమ్యం గమనం అనే అంశంపై ఏ . నరసింహ రెడ్డి గారు ప్రసంగిస్తూ ఫెడరేషన్ అనేది అణచివేతకు అన్యాయానికి వ్యతిరేకంగా నిలబడడమని అన్నారు. సమాజంలో కొంతమంది మరికొంతమంది ని అనగదొక్కడానికి కొన్ని సమూహాలుగా ఏర్పడుతుంటారని. వాటిలో కులం మతం జెండర్ కూడా ఉన్నాయని అభిప్రాయపడ్డారు. ప్రస్తుత సమాజానికి ఫెడరేషన్ కార్యకర్తల అవసరం ఉందని అన్నారు...ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఎమ్మెల్సీ కోదండరాం గారు మాట్లాడుతూ అశోక్ కుమార్ గారు తన జీవితమంతా సమాజం కోసం అంకితం చేశారని ఒక ఉపాధ్యాయుడిగా టి పి టి ఎఫ్ నాయకుడిగా తెలంగాణ ఉద్యమ కారుడిగా అనేక సామాజిక ఉద్యమాల్లో పాల్గొని తన సామాజిక స్పృహ ను చతుకున్నారని అన్నారు. అశోక్ కుమార్ గారు ఉద్యోగ విరమణ అనంతరం కూడా సామాజిక ఉద్యమాల్లో ఉండాలని ప్రజల కొరకు ఉద్యమించడానికి తను పునరంకితం కావాలని కోరారు...ఆయన వ్యక్తిత్వానికి ఆయన సిన్సియారిటి కి నిదర్శనమే ఈరోజు ఇంత మంది అదరించడానికి కారణమని అన్నారు...ఈ కార్యక్రమానికి వచ్చిన అనేక మంది అశోక్ కుమార్ అంకిత భావ సేవ గురించి ఆయన ఉద్యమ నేపథ్యం గురించి నిజాయితీ గురించి అనేక విషయాలు మాట్లాడారు.ముఖ్య అతిథి ఏ కోదండరాం, ఎం ఎల్ ఏ చింతా ప్రభాకర్, మాజీ ఎం ఎల్సీ ఆర్ సత్యనారాయణ, జిల్లా విద్యాశాఖాధికారి వెంకటేశ్వర్లు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నాగిరెడ్డి, అదనపు ప్రధాన కార్యదర్శి ముత్యాల రవీందర్, వక్తలుగా ఏ నర్సింహ రెడి, ప్రొఫెసర్ లక్ష్మీనారాయణ, మనోహర్ రాజు, రఘునందన్, కొండల్ రెడ్డి, వేణుగోపాల్, శ్రీనివాస్, గుంయి ఎల్లయ్య, నన్నెబొయిన తిరుపతి, జిల్లా నాయకులు సంజీవయ్య, లక్ష్మయ్య యాదవ్, సోమశేఖర్, సుభాష్ బాబు, నాగేశ్వర్, జీవన్ రావ్, ప్రశాంతి, అశోక్, విజను భాస్కర్, నాసర్ పటేల్, అశోక్ కుమార్, బాబు రావ్, జనార్దన్ రెడ్డి మొదలగువారు పాల్గొన్నారు.

## నూతన హొటల్ ను ప్రారంభించిన మెదక్ పార్లమెంట్ ఇంచార్జ్ నీలం మధు ముదిరాజ్



గుమ్మడిదల,అక్టోబర్ 05 ( మెతుకు సీమ న్యూస్) : మండల పరిధిలోని బొంతపల్లి పారిశ్రామిక వాడలో నూతన హొటలను మెదక్ పార్లమెంట్ ఇంచార్జ్ నీల మధు ముదిరాజ్ శుక్రవారం ప్రారంభించారు పారిశ్రామిక వాడలో ఎలాంటి హొటల్ సౌకర్యం లేకపోవడంతో కాంగ్రెస్ పార్టీ శ్రేయోభిలాషి కార్యకర్త అభిశెట్టి నాగరాజు రాఘవేంద్ర భవన్ పేరుతో భోజనము బిర్యానీ తదితర వంటకాలు తయారు చేసే హొటల్ ను ప్రారంభించినందుకు హొటల్ యాజమాన్యం కుటుంబ సభ్యులతో కలిసి శాలువాలతో సత్కరించారు కార్యక్రమంలో ఎన్ఎంఆర్ యువసేన సభ్యులు మాజీ సర్పంచ్ మ్యకం తిరుమల వాసు, దర్గా బిక్షపతి, నర్సింలు, బిక్షపతి రెడ్డి, సురభి కుమార్ గౌడ్, గ్యారాల మల్లేష్, కుమ్మరి వెంకటేష్, ఎజాస్ పాషా, ఎండి హుస్సేన్, నారాయణరెడ్డి, గోపాల్, వీరేశం, నర్సింలు, వెంకట్ రెడ్డి, వెంకటేష్, తదితరులు పాల్గొన్నారు.

---

## యువత చెడు వ్యసనాలకు దూరంగా ఉండాలి

- జీవితంలో మంచి గోల్స్ పెట్టుకొని వాటిని సాధించే విధంగా కృషి చేయాలి
- డ్రగ్ మహమ్మారిని తరిమికొట్టడంలో యువతదే కీలక పాత్ర




జహీరాబాద్,అక్టోబర్ 05 ( మెతుకు సీమ న్యూస్) : యువత ఎక్కువగా చెడు మార్గంలో నడవడానికి ప్రధాన కారణం సినిమాలేనని, సినిమా చూపించే చెడుకు ప్రభావితం కాకుండా దానిలోని నీతిని గుర్తించాలన్నారు. ఒక వ్యక్తి జీవితంలో మొదటి 25 సంవత్సరాలు చాలా కీలకం అని కష్టపడి చదివి గోల్స్ ను నెరవేర్చుకున్నట్లైతే జీవితం చాలా అందంగా ఉంటుందని టి ఎస్ ఎన్ ఎ బి .డి.ఎస్.పి పుష్పన్ కుమార్ అన్నారు. శుక్రవారం పట్టణంలోని మాస్టర్ మైండ్ జూనియర్ కళాశాలలో మాదకద్రవ్యాల నియంత్రణ పై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, గుట్కా సిగరెట్, వంటి వాటికి బానిసలైతే సర్వస్వం కోల్పోవాల్సి వస్తుందన్నారు. యువత చెడు వ్యసనాలకు దూరంగా ఉండాలని, మన తల్లిదండ్రులు మనపై పెట్టుకున్న నమ్మకాన్ని వమ్ము చేయకుండా కష్టపడి చేదివితే ఉన్నత శిఖరాలను అధిరోహించగలరన్నారు.విద్యార్థిని విద్యార్థులుగా ఉన్నత లక్ష్యాలను నిర్దేశించుకుని వాటిని నెరవేర్చుకునే దిశగా కృషి చేయాలి అంతేగాని అనవసర చెడు వ్యసనాలకు బానిసలై తల్లిదండ్రులకు దేశానికి భారంగా మిగలకూడదన్నారు. సి ఐ రాము నాయక్ మాట్లాడుతూ భారత దేశ పౌరులుగా పుట్టడం మన అదృష్టమని, భారత పౌరులుగా దేశానికి ఏదోరకంగా ఉపయోగపడాలి అన్నారు. నూతన చట్టాల గురించి అవగాహన కలిగి మంచి మార్గంలో నడవాలని యువతకు దిశా నిర్దేశం చేశారు.ఈ కార్యక్రమంలో జహీరాబాద్ పట్టణ ఎస్ ఐ కాశీనాథ్, జాగృతి డిగ్రీ కళాశాల కరస్పాండెంట్ సుభాష్ రెడ్డి, మహిళ ఎస్ ఐ హారిక మాస్టర్ మైండ్ కళాశాల ప్రిన్సిపాల్, సిబ్బంది, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

---

## కార్మికుల సంక్షేమం సి ఐ టి యూ లక్ష్యం




సంగారెడ్డి బ్యూరో,అక్టోబర్ 05 ( మెతుకు సీమ న్యూస్) : కార్మికుల కోసం నిరంతరం పోరాడే యూనియన్ సిఐటియు... సి ఐ టి యూ జిల్లా, సి ఐ ఈ యూనియన్ అధ్యక్షుడు బీరం మల్లేష్ సీఐఈ లో బ్రహ్మాండమైన వేతనం ఒప్పందం సిఐటియు బాధ్యత బుచినెల్లి గ్రామ పరిధిలో ఉన్న సీఐఈ ఆటో మోటివ్ ఇండియా పరిశ్రమలో ఈ నెల 5న జరిగే ఎన్నికల సంధర్భంగా ఈరోజు సీఐటీయూ గేట్ మీటింగ్ జరిగింది.ఈ గేట్ మీటింగ్లో పాల్గొన్న సీఐటీయు జిల్లా అధ్యక్షుడు, యూనియన్ అధ్యక్షుడు బీరం మల్లేశం మాట్లాడుతూ కార్మికుల కోసం నిరంతరం కృషి చేసి కార్మికుల హక్కులకు పాటుపడుతున్న సిఐటియుకు మంచి మెజారిటీతో గెలిపించాలని సిఐటియు గెలవగానే మంచి బ్రహ్మాండమైన వేతన ఒప్పందం చేయడం జరుగుతుందని, అనేక సౌకర్యాలు సాధించి పెడుతుందని అన్నారు. మంచి వేతన ఒప్పందం కాంట్రాక్ట్ కార్మికుల పర్మనెంట్, అనేక సమస్యల పరిష్కారం కోసం సిఐటియు కృషి చేస్తుందని సిఐటియుకు అత్యధిక ఓట్లు వేసి గెలిపించాలని విజ్ఞప్తి చేశారు. ఈ జిల్లాలోని అత్యధిక పరిశ్రమల్లో సిఐటియు మంచి వేతన ఒప్పందాలు, చేసి అనేక రకాల సౌకర్యాలు, పెర్మనెంట్లు చేయించిన ఘనత సిఐటియు దే అని అన్నారు. సిఐటియును కార్మికులు ఆదరించి గెలిపించాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో సి ఐ ఈ ప్రధాన కార్యదర్శి సందీప్ రెడ్డి, సి ఐ టి యూ క్లస్టర్ కన్వీనర్, యూనియన్ వర్కింగ్ ప్రెసిడెంట్ %ూ%. మహిపాల్, వివిధ పరిశ్రమల యూనియన్స్ నాయకులు రాజిరెడ్డి, నర్సయ్య, వంశి, నారాయణ, రాజు, పాషా తదితరులున్నారు.

---

## తుల్జాపూర్ పాదయాత్ర కు బయలుదేరిన భక్తులు



ఝరాసంగం,అక్టోబర్ 05 ( మెతుకు సీమ న్యూస్) : ఝరాసంగం నుండి తుల్జాపూర్ పాదయాత్ర కు బయలుదేరిన భక్తులు శుక్రవారం కేతకి ఆలయాన్ని దర్శించుకుని పాదయాత్ర గా బయలుదేరిన ఝరాసంగం భక్తులు ఈ కార్యక్రమం లో రాజశేఖర్ కిషోర్ కుమార్ శివ కుమార్ మల్లికార్జున్ మహేష్ తదితరులు పాల్గొన్నారు.

Printed,Published and owned by baindla Srinivas,Madava nagar,Sangareddy-502001,Telangana State,
Phone No. 9032793832 Mail id:methukuseemanews@gmail.com